

# విభారే
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 27 ఆగస్టు 2021 సంపుటి : 03 సంచిక :24 పేజీలు : 4 వెల : రూ 3-00



## సాంకేతిక అంతరాల్లేని అంతర్జాల విద్యరావాలి: వెంకయ్యనాయుడు



న్యూఢిల్లీ : అంతర్జాల విద్య, దూరవిద్యలో సమగ్ర విద్యావిధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉన్నదని భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయడు సూచించారు. సమాజంలో ఉన్న సాంకేతిక అంతరాలను తొలగించి, సాంకేతిక వారధులను నిర్మించడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానమైన విద్యావకాశాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యాలను మరింత మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఉన్నదని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వ చేపట్టిన భారత్ నెట్ కార్యక్రమాన్ని మరింత వేగవంతంగా అమలుపరచాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా కేంద్రీయ విశ్వవిద్యాలయం స్థాపన దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అంతర్జాల వేదిక ద్వారా ఉపరాష్ట్రపతి విశిష్ట అతిథిగా హాజరై ప్రసంగించారు. సామాజిక, ప్రాంత అభివృద్ధితోపాటు దేశ ఆర్థికాభివృద్ధిలో ఉన్నతవిద్య కీలకపాత్ర పోషిస్తున్నదని అన్నారు. భారతదేశ విశ్వవిద్యాలయాల ప్రపంచీకరణ జరగాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. విద్యార్థులు, అధ్యాపకులు కూడా వివిధ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని సూచించారు. భారతీయ భాషల్లో ఆన్‌లైన్ కోర్సుల కొరతను ప్రస్తావిస్తూ, ఎడ్యుటెక్ రంగంలోని ప్రైవేటు సంస్థలు, ప్రాంతీయ భాషల్లో కోర్సుల రూపకల్పనకు నడుం బిగించాలన్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం ద్వారా భారతీయ విద్యారంగంలో పరిపూర్ణమైన మార్పులు రానున్నాయని వెంకయ్యనాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పోతన పద్యాన్ని ఉదహరిస్తూ విద్య గొప్పతనాన్ని తెలియజేసిన కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్‌ను ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, అనంతపురం పార్లమెంటు సభ్యుడు తలారి రంగయ్య, విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్ఏ కోరితోపాటు అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది అంతర్జాల వేదిక ద్వారా పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కుపోతే ముందు మనమే తుక్కు

### బయటకు చెప్పలేక..అధిష్టానాన్ని ఒప్పించలేక సతమతం
### ఎపి విభజనతో కాంగ్రెస్ ఖతం..ఇప్పుడు మనకూ అదేగతి
### స్థానిక బిజెపి నేతల్లో తీవ్ర ఆందోళన





విశాఖపట్టణం,ఆగస్ట్26(): ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో అంతంతమాత్రంగా ఉన్న బీజేపీ ప్రాభవం ఇప్పుడు మోడీ తీసుకుంటున్న నిర్ణయాలతో మరింత గడ్డుకాలంలోకి ప్రవేశించేలా ఉందిన నేతలు లోలోన మదనపడుతున్నారు. సెంటిమెంటుతో కూడుకున్న విశాక ఉక్కును తెగనమ్మడం వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఈ విషయాన్ని మోడీకి నేరుగా చెప్పే ధైర్యం ఉన్న నేతలు కానరావడం లేదు. ఎపిలో పాగా వేయాలనుకుంటున్న దశలో తమ భవిష్యత్తు ఆశలపై విశ్యాఖ ఉక్కు నీళ్లు చల్లిందని అంటున్నారు. ఎపి విభజనతో కాంగ్రెస్ మూల్యం చెల్లించుకున్నట్లుగానే విశ్యాఖ ఉక్కుతో బీజేపీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్న భయం వీరిలో కలుగుతోంది. వచ్చే శాసన సభ ఎన్నికల్లోనైనా ఒడిశాలో అధికారం చేజిక్కించుకుంటామనే ఆశలతో ఉన్న బిజెపి అధిష్ఠాన వర్గంపైన, కేందప్రభుత్వంపైన ఒడిషా బీజేపీ నేతలు ఒత్తిడి తెచ్చి ఈ అనాలోచిత నిర్ణయాన్ని విరమింప చేయాలని కోరుకుంటున్నారు. విశాఖ ఉక్కు భూములను చంద్రబాబు నాయుడు గంగవరం పోర్టు నిర్మాణం కోసం ప్రైవేటు వ్యక్తులకు కారు చౌకగా కట్టబెడితే, నేటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఉక్కు కర్మాగారం భూములను అమ్మి అప్పులు తీర్చవచ్చునని ఒక దశలో ప్రకటించారు. విధిలేక, ఇప్పుడు రాష్ట్రంలోని పాలక, ప్రతిపక్షాలు కేంద ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇంకా ఐక్యవేదిక విస్తృతం చేయడం ద్వారా విశ్యాఖ ఉక్కు కోసం ఒత్తిడి పెంచాలన్న భావన ఉంది.. జాతీయస్థాయిలో అన్ని రాజకీయ పక్షాలను కలుపుకునే ప్రయత్నం చేయాల్సి ఉన్నా విపక్ష టిడిపి కూడా అందుకు పెద్దగా కలసి రావడం లేదు. కేంద్రప్రభుత్వరంగ సంస్థ కాబట్టి విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మడమే లక్ష్యంగా ప్రధాని మోడీ నిర్ణయాన్ని ప్రకటించారు. విశాఖ ఉక్కులో ముఖ్యంగా ఒడిశాకు చెందిన వారు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమంది ఉపాధి పొందు తున్నారు. అందువలన ఈ కర్మాగారం గురించి కేంద్ర ప్రభుత్వంపై ఒడిషా ప్రభుత్వం కూడా పోరాడాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. అలాగే జాతీయ రాజకీయ పక్షాలతోపాటు ఒడిశా, బిహార్, బెంగాల్, తమిళనాడు, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర ప్రాంతీయ పార్టీలు కూడా విశాఖ ఉక్కును జాతి సంపదగా గుర్తించి కాపాడుకోవడానికి ముందుకు రావాలని వివిధ సంఘాలు కోరుతున్నాయి. 1966లో విశాఖ ఉక్కు? ఆంధ్రుల హక్కు నినాదంతో, ఎంతో స్ఫూర్తితో, ప్రాణత్యాగాలు సైతం చేసి పోరాడి విశాఖ ఉక్కును సాధించుకున్నారు. అయినా నేటికీ వేలాదిమంది నిర్వాసితులు ఉద్యోగావకాశాలు దక్కక ఆందోళనలు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. తమ భూముల్ని త్యాగం చేసిన చిన్న సన్నకారు రైతులు నేడు కూలీలుగా బతుకులు వెళ్లదీస్తున్న దుస్థితి ఏర్పడింది. విశాఖ ఉక్కు కర్మాగారం స్థాపన ఫలితాలు స్థానికులకు, భూములు కోల్పోయి నిర్వాసితులకు తగినంత దక్కనే లేదు. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు ఈ విషయాలన్నీ బాగా తెలుసు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కాబట్టి విశాఖ ఉక్కు పరిశ్రమలో ఇతర రాష్ట్రాలకు చెందినవారు కూడా పనిచేస్తున్నారు. ముఖ్యంగా ఒడిశాకు చెందిన వారు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు. అందువలన ఈ కర్మాగారం గురించి కేందప్రభుత్వం దేశ ప్రయోజనాల దృష్టితో, జాతి సమైక్యత దృష్టితో ఆలోచించాలని కోరుతున్నాయి. అలాగే ఎపిలో బిజెపిని బలోపేతం చేస్తున్న వేళ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ఆలోచన విరమించాలని బిజెపి నేతలు కూడా కోరుకుంటున్నారు. విశాఖ ఉక్కును జాతి సంపదగా గుర్తించి కాపాడుకోవడానికి కృషి చేయాలి.

## ఆంధ్రప్రదేశ్‌లో కొవిడ్ బారినపడి 12 మంది మృతి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా 67,590 పరీక్షలు నిర్వహించగా.. 1,539 కేసులు నిర్ధారణ అయ్యాయి. తాజా కేసులతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రంలో 20,07,730 మంది వైరస్ బారినపడినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వెల్లడించింది.



గడిచిన 24 గంటల వ్యవధిలో కొవిడ్ వల్ల 12 మంది బాధితులు ప్రాణాలు కోల్పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మృతుల సంఖ్య 13,778కి చేరింది. 24 గంటల వ్యవధిలో 1,140 మంది బాధితులు కోలుకోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా కోలుకున్న వారి సంఖ్య 19,79,504కి చేరినట్లు వైద్యారోగ్య శాఖ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో 13,778 యాక్టివ్ కేసులున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 2,63,37,946 నమూనాలను ఆరోగ్య శాఖ పరీక్షించింది.

## సుప్రీంకోర్టుకు 9 మంది కొత్త జడ్జీలు

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టుకు 9 మంది కొత్త జడ్జీలు నియమితులయ్యారు. వీరిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ 9 మంది కొత్త న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. కొత్తగా నియమితులైన 9 మందిలో ముగ్గురు మహిళా న్యాయమూర్తులు ఉన్నారు.సుప్రీంకోర్టుకు కొత్తగా 9 మంది న్యాయమూర్తులను నియమించాలని సుప్రీంకోర్టు కొలిజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ మేరకు ఈ సిఫారసులను కేంద్రం అనుమతించగా.. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వారి నియమాకం ఫైలుపై సంతకం చేసినట్లు సమాచారం. సుప్రీంకోర్టుకు కొత్తగా నియమితులవుతున్న న్యాయమూర్తుల్లో.. సీనియర్ న్యాయమూర్తి బీవీ నాగరత్న కూడా ఉన్నారు. ఈమె 2027 సెప్టెంబర్ నెలలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఈ పదవిలో నియమితులైన తొలి మహిళగా జస్టిస్ బీవీ



నాగరత్న చరిత్రలో నిలిచిపోను న్నారు.మిగిలిన వారిలో బేలా ఎం త్రివేది, హిమకోహ్లీ, సీటీ రవికుమార్, ఎంఎం సుందరేశ్, మాజీ అదనపు సొలిసిటర్ జనరల్ పీఎస్ నరసింహ, అభయ్ శ్రీనివాస్ ఓక, విక్రమ్‌నాథ్, జితేంద్ర కుమార్ మహేశ్వరి కూడా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ నేతృత్వంలోని న్యాయమూర్తులు యూయూ లలిత్, ఏఎం ఖన్‌విల్కర్, డీవై చంద్రచూడ్, ఎల్ నాగేశ్వర్‌రావులతో కూడిన సుప్రీంకోర్టు కొలీజియం 9 మంది పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. 9 మంది న్యాయమూర్తులను కొలీజియం సిఫారసు చేయడం, వారిని కేంద్రం ఆమోదించడం ఇదే మొదటిసారి అని తెలుస్తున్నది.

## ప్రభుత్వం ఎందుకు ఖర్చు పెట్టడం లేదు: రామకృష్ణ

విజయవాడ: హంద్రీనీవా కాలువ ద్వారా 106 చెరువుల పనుల కోసం 220 కోట్లు ప్రభుత్వం ఎందుకు ఖర్చు పెట్టడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రశ్నించారు.



డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి, ముఖ్యమంత్రి కలిస్తే 106 చెరువులకు హంద్రీనీవా కాల్వ ద్వారా నింపలేరా? అని ఆయన ప్రశ్నించారు. ఆరు లక్షల ఎకరాలకు సాగు చేయాల్సింది, కనీసం ఒక లక్ష ఎకరాలు కూడా కాలువ పనులు పూర్తి చేయలేదన్నారు. 106 చెరువులో హంద్రీనీవా ద్వారా కాలువలు నింప కాకపోతే రాయలసీమ నాలుగు జిల్లాల రైతు సంఘాల ఆధ్వర్యంలో సీపీఐ పార్టీ కలిసి త్వరలోనే ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు.

## ఆర్బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అజయ్ కుమార్

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అజయ్ కుమార్‌ను నియమించింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అతడి నియామకం ఆగస్టు 20 నుంచి అమల్లోకి వచ్చింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియామకానికి ముందు ఆయన న్యూఢిల్లీలోని రీజనల్ డైరెక్టరేట్‌లో రీజనల్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. కరెన్సీ మేనేజ్‌మెంట్, ఫారిన్ ఎక్స్ఛేంజ్ డిపార్ట్‌మెంట్, ప్రిమిసెస్ డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా అజయ్ కుమార్ బాధ్యతలు చూస్తారు. సెంట్రల్




బ్యాంక్‌లో అజయ్ కుమార్‌కు మూడు దశాబ్దాల అనుభవం ఉన్నది.పాట్నా విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, ఇక్ఫాయ్ నుంచి ఎంఎస్, బ్యాంకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ నుంచి సర్టిఫైడ్ బ్యాంక్ మేనేజర్ కోర్సులు చదివారు. చికాగోలోని కెల్లోగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ను కూడా పూర్తిచేశారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్టిఫైడ్ అసోసియేట్‌తో పాటు ఇతర వృత్తిపరమైన అర్హతలు కూడా కలిగి ఉన్నారు. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మూడేండ్ల పదవీకాలం కూడా 2021 డిసెంబర్ నెలలో ముగియనున్నది.

## రెండు ప్రాణాలను కాపాడిన దిశ యాప్

విజయవాడ: దిశ యాప్ రెండు నిండు ప్రాణాలను కాపాడింది. బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో విజయవాడకు చెందిన ఓ మహిళ తను ఆత్మహత్య చేసుకుంటున్నానని దిశ ఎస్ఓఎస్‌కు సమాచారం ఇచ్చింది. ప్రేమ పేరుతో నమ్ముకొని వచ్చిన అఖిల్ తనను మోసం చేయడంతో సమాజంలో ఎదురయ్యే అవమానాలను భరించే ధైర్యం లేక గత్యంతరం లేని పరిస్థితిలో ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన కుమార్తెను పోలీసులు చేరదీసి ఆదుకోవాలని కోరింది. వెంటనే స్పందించిన దిశ కంట్రోల్




రూం సిబ్బంది మహిళ ఫోన్ నెంబరు ఆధారంగా ఆమె ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. హుటాహుటిన విజయవాడలోని అజిత్ సింగ్ నగర్ పోలీసులకు సమాచారం అందించారు. సకాలంలో స్పందించిన సమీపంలో విధులు నిర్వహిస్తున్న పెట్రోలింగ్ పోలీసులు కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే మహిళ ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు.

## నకిలీ చలానాల కేసు: ప్రధాన నిందితుడు అరెస్ట్




కృష్ణా జిల్లా: మండవల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీ చలానాల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ప్రధాన నిందితుడు స్టాంప్ వెండర్ రామ్ ధీరజ్‌ను అరెస్ట్ చేశారు. కైకలూరు పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ వివరాలు వెల్లడించారు. నిందితుడి నుంచి రూ.1.02 కోట్లు నగదు రీవకరీ చేశామని తెలిపారు. నకిలీ చలానాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న బాధితులు ఆందోళన చెందనవసరం లేదని ఎస్పీ అన్నారు. నిందితుల నుంచి నూరు శాతం నగదు రికవరీకి చర్యలు చేపట్టామన్నారు.మిగిలిన మొత్తాన్ని కూడా రికవరీ చేస్తాం: మంత్రి ధర్మానప్రకాశం: రిజిస్ట్రేషన్ శాఖలో రూ.10 కోట్ల అవకతవకలు జరిగినట్లు గుర్తించామని మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికే రూ. 7 కోట్లు రికవరీ చేశామన్నారు. మిగిలిన మొత్తాన్ని కూడా రికవరీ చేస్తామని మంత్రి ధర్మాన అన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో అవకతవకలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు.

# సంపాదకీయం

శుక్రవారం 27 ఆగస్టు 2021

## కులాల గణనకు పెరుగుతున్న డిమాండ్

జనాభా లెక్కల్లో కులం వరిగణనలోకి తీసుకోవాల్సిందేనంటున్నాయి రాజకీయ పార్టీలు. బీజేపీ కూడా ఒక పార్టీగా అందుకు సానుకూలమే. కానీ కేంద్రప్రభుత్వం మాత్రం పెద్దగా స్పందించడం లేదు. ఈ నిర్ణయం తీసుకోవడంలో ప్రభుత్వాల లెక్కలు వేరు. నిజానికి ప్రజాస్వామ్యంలో ఓట్ల లెక్కలే రాజ్యం చేస్తున్నాయి. కులాలవారీ ప్రాధాన్యాలు పెరిగిపోయాయి. అభ్యర్థుల ఎంపిక మొదలు , మంత్రివర్గాల్లో స్థానాల వరకూ అన్నిటా కులం లెక్కలే. మరి వివిధ సామాజిక కులాల జనాభాను ఒక నిర్దిష్టమైన పరిణామంలో సాధికారికంగా నిరూపించేందుకు సెన్సెస్ ను వినియోగించుకోవచ్చు. కానీ ప్రభుత్వాలు రకరకాల కారణాలతో వెనకంజ వేస్తున్నాయి. గడచిన 20 సంవత్సరాలుగా ఈ డిమాండ్ వినవస్తూనే ఉంది. దానంతటదే పక్కనపడుతోంది. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ స్థూలంగా జనాభా లెక్కల్లో కులగణనను ప్రామాణికంగా తీసుకోవడం లేదు. కేవలం షెడ్యూల్డుకులాలు, షెడ్యూల్డు తెగలు, ఇతరులు అనే మూడు కేటగిరిల్లోనే జనాభాను పరిగణిస్తున్నారు. దేశవ్యాప్తంగా క్రమేపీ రిజర్వేషన్ సంస్కృతి విస్తరిస్తోంది. కేంద్రమే స్వయంగా ఓబీసీ ప్రవేశపెట్టింది. ఈబీసీని ఆచరణలోకి తెచ్చింది. ఇక రాష్ట్రాలు రిజర్వేషన్లను రకరకాల రూపంలో అమలు చేస్తున్నాయి. ఆయా సామాజిక వర్గాలను ఉద్ధరించాలన్న లక్ష్యం కంటే ఓట్లుగా మలచుకోవాలనే తపనే ఎక్కువ. ఈ నేపథ్యంలోనే సామాజిక సంతులనం దెబ్బతింటోంది. వివిధ కులాలు తమ జనాభాను ఎక్కువ చేసి చూపేందుకే ప్రయత్నం చేస్తున్నాయి. తద్వారా ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రయోజనం ఎక్కువగా పొందాలనేది ఆయా వర్గాల లక్ష్యం. దీనివల్ల సమాజం నుంచి చేయూత పొందాల్సిన వర్గాలు అన్యాయానికే గురవుతున్నాయి. అందుకే ప్రతి పది సంవత్సరాలకోసారి నిర్వహించే జనాభా లెక్కల్లో కచ్చితంగా కులాలవారీ జనాభాను తేల్చడం అవసరమైన అంశమే. రాజకీయ పార్టీలు ప్రజలను మనుషులుగా చూడటం మానేశాయి. ఓట్ల కిందనే పరిగణనలోకి తీసుకుంటున్నాయి. జనాభా లో అధిక సంఖ్యలో ఉండాలి. లేదా ఆర్థికంగా బలంగా ఉండి, ఓట్లను గంపగుత్తగా కొనుగోలు చేయగల సామర్థ్యం ఉండాలి. అటువంటి వారే చట్టసభలకు అభ్యర్థులుగా ఎంపిక అవుతున్నారు. వారే పాలకులుగా మారుతున్నారు. సామాజిక సంక్షేమం, బలహీనవర్గాలను ఆదుకోవడం వంటి కబుర్లన్నీ మెరమెచ్చు మాటలే. ఆయా వర్గాలకున్న ఓటు బ్యాంకును దృష్టిలో పెట్టుకునే సంక్షేమ పథకాలను ఆచరణలోకి తెస్తున్నారు. తీవ్రంగా వెనకబడిన వారిని ప్రధాన స్రవంతిలోని వర్గాలకు సమానంగా తేవాలనే సామాజిక లక్ష్యం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలోనే బలమైన సామాజిక వర్గాలు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలకోసం రాజకీయ పార్టీలను బ్లాక్ మెయిల్ చేస్తున్నాయి. దీంతో బలహీనంగా ఉన్నవారు నష్టపోతున్నారు. దీనికి పరిష్కారం సమాజంలో వివిధ వర్గాల జనాభాను సాధికారికంగా తేల్చి, తర్వాత వివిధ ప్రభుత్వ పదవులు, సామాజిక అంతస్థులో ఎవరెక్కడ ఉన్నారో లెక్క తీస్తే సరిపోతుంది. దానికనుగుణంగా సీట్ల కేటాయింపు, పదవుల పంపిణీ చేయవచ్చు. లేకపోతే కొన్ని వర్గాలు, పలుకుబడి కలిగిన వారికే రాజకీయ పార్టీలు పెద్దపీట వేస్తున్నాయి. భారతదేశంలో రిజర్వేషన్ కోరుకోని వారిదే తప్పు అన్నట్లుగా మారింది పరిస్థితి. దాదాపు అన్ని సామాజిక వర్గాలు రిజర్వేషన్ కోటాలో తమను చేర్చాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే రిజర్వేషన్ పరిధిలో ఉన్నవర్గాలు తమకు మరింత మెరుగ్గా ఫలితాలు లభించేందుకు గాను ఇంకా మెరుగైన కోటా పరిధిలోకి తేవాలని డిమాండ్ చేస్తున్నాయి. అనుచితమైన ప్రయోజనం పొందాలని వెంపర్లాడుతున్నారు. ఎస్సీ,ఎస్టీ వర్గాల వారు కూడా పది ఇరవై సంవత్సరాల తర్వాత సమాజంలో ఇతరులతో సమాన స్థాయికి చేరుకొంటారని అంబేద్కర్ భావించారు. రిజర్వేషన్ దీర్ఘకాలం ఉండటం వాంఛనీయం కాదని పేర్కొన్నారు. కానీ 75 సంవత్సరాల తర్వాత కూడా రిజర్వేషన్ అన్నది మరింత గా విస్తరించింది. ప్రయోజనాలు పలచనైపో యాయి. రాజకీయ పార్టీలు ప్రతి ఎన్నికల సందర్భంలోనూ కొన్ని కొత్తకులాలకు రిజర్వేషన్ ఇస్తామంటూ నమ్మబలుకుతున్నాయి. అవసరాన్ని బట్టి వాటిని ఇంప్లిమెంట్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. సమాజంలో ఒత్తిడి రాజకీయాలు పెరిగిపోయాయి. సామాజిక వెనకబాటుతనం కంటే అనుచిత లబ్ధి కోసం కొన్ని వర్గాలు ఆశపడటం, వాటికి రాజకీయ పార్టీలు దన్నుగా నిలవడం పరిపాటిగా మారింది. ఇది సమాజంలో సంక్షోభానికి కారణమవుతుంది. అందుకే ఎవరి జనాభా ఎంత ఉందనేది తేలాలి. ఇప్పటివరకూ ఆయా వర్గాలు పొందిన ప్రయోజనాలు వెల్లడి కావాలి. లోపాలను అనుసరించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. రిజర్వేషన్లకు అవసరమే ప్రాతిపదిక కావాలి. కొన్ని వర్గాలు మాత్రమే రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తే మిగిలిన వర్గాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అందుకే ఈ ఏడాది జరగబోయే జనగణనలో కచ్చితంగా కులాలవారీ లెక్కలు సేకరిస్తేనే మంచిది.

## బెర్తు కోసం రజనీ దూకుడు

గుంటూరు, ఆగస్టు 26, (న్యూస్ పల్స్)లేటుగా రాజకీయాల్లోకి వచ్చినా లేటెస్టుగా రాజకీయాలు చేయడం అలవాటు చేసుకున్న నాయకురాలు.. చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజని. ఆది నుంచి కూడా ఆమె దూకుడు సెపరేటు. ఆమె ఎప్పుడు ఏం మాట్లాడినా.. ఏం చేసినా.. సంచలనమే. ఇక, కరోనా సమయంలో ఎమ్మెల్యేలు, నాయకులు అందరూ ఎక్కడికక్కడ మౌనంగా ఇంటి పట్టునే ఉన్నారు. అంతేకాదు, ఏ కార్యక్రమాలు కూడా నిర్వహించడం లేదు. దీంతో తలతిరిగిన నాయకులు కూడా ప్రచారానికి దూరమయ్యారు. ఇలాంటి సమయంలోనూ ఉవ్వెత్తున ప్రచారంలో ముందున్నారు విడదల రజనీ. ఇక స్థానికంగా చిలకలూరిపేట మీడియాతో పాటు జిల్లా మీడియాకు కూడా నిత్యావసరాలు రెండు, మూడు సార్లు సరఫరా చేసి మీడియాను కూడా ఆకర్షించేశారు. కొవిడ్ సమయంలోనూ తన నియోజకవర్గంలో ప్రజలను అలెర్ట్ చేస్తున్నారు రజనీ. ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో నిత్యం ప్రజలకు టచ్‌లో ఉంటున్నారు. తన సందేశాలు వినిపిస్తున్నారు. దీంతో ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ లో మంచి ఫాలోయింగ్‌ను కూడా ఆమె సంపాయించుకున్నారు. దీంతో ఇప్పుడు ఏ నోట విన్నా విడదల రజనీ పేరే వినిపిస్తోంది. పైగా తన నియోజకవర్గంలో ప్రత్యక్షంగా కార్యక్రమాలు నిర్వహించాల్సిన సమయంలోనూ ఆమె తన ఫొటోతో పెద్ద పెద్ద కటౌట్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వాస్తవానికి ఇలాంటి పెద్ద పెద్ద పోస్టర్లు.. కటౌట్లు ఏర్పాటు చేసుకున్నప్పుడు.. స్థానికంగా ఉన్న ఎంపీ లేదా సీనియర్ నేతల ఫొటోలు కూడా ఏర్పాటు చేసుకుంటారు. కానీ, రజనీ మాత్రం సీఎం ఫొటో.. తన ఫొటో తప్ప ఇంకెవరికీ ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కొద్ది రోజుల పాటు సీఎం ఫొటోలు కూడా లేకపోవడంతో సొంత పార్టీ నేతల్లోనే విమర్శలు వచ్చాయి. పట్టణం నడిబొడ్డున ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సీఎం ఫొటో లేకపోవడంతో జిల్లా స్థాయిలో చర్చ జరిగింది. అప్పటికప్పుడు సీఎం ఫొటో తెచ్చి అక్కడ అతికించారన్న టాక్ కూడా ఉంది. ఇక విడదల రజనీ ఫొటోల్లో స్థానిక సీనియర్ నేత మర్రి రాజశేఖర్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు ఫొటోలు కూడా లేని పరిస్థితి. ఇక రాష్ట్రానికి సంబంధించి ఏవైనా కీలక ప్రాజెక్టులు వచ్చినా కూడా వాటిని తేవడంలో విడదల రజనీ పాత్రే కీలకం అని.. తానే జగన్‌తో మాట్లాడి వీటిని రాష్ట్రానికి తెచ్చేలా చేశానని పోస్టర్లు వేసుకుని ప్రచారం చేసుకుంటున్నారట. ఏపీలో కొత్త పారిశ్రామిక విధానాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన వచ్చిన కొద్ది నిమిషాలకే ఎమ్మెల్యే రజనీ ఫొటోలతో పోస్టర్లు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. చివరకు ఈ ప్రచారం ఏ రేంజ్‌కు వెళ్లిందంటే చిలకలూరిపేటకు శ్రీశైలం జలాలకు ఎలాంటి సంబంధం లేదు. అయితే అక్టోబర్ నాటికి వెలిగొండ జలాలు పరవళ్లు అంటూ ఆమె ఓ రేంజ్‌లో ప్రచారం చేసుకుంటున్నారు. చిలకలూరిపేటలో అతీగతీ లేకుండా ఉన్న ఆటోనగర్‌ను పట్టించుకోని విడదల రజనీ ? తిరుపతి, విశాఖపట్నం సైన్స్ సిటీలపై పోస్టర్లు వేయడం ఏంటని నియోజకవర్గ ప్రజలు భగ్గుమంటున్నారు. ఆమె సోషల్ మీడియా పోస్టులు చూస్తే సీఎం జగన్‌కు, మంత్రులకే రాని విధంగా లైకులు, షేర్లు, వ్యూస్ వస్తున్నాయట. ఇప్పుడు ఈ విషయం వైసీపీ వర్గాల్లో భారీగా చర్చకు వస్తోంది. ఇదంతా పెయిడ్ గేమ్ అని కూడా కొందరు చెపుతున్నారు. మొత్తంగా ప్రచారంలో సీఎం జగన్‌కు మించిపోయేలా విడదల రజనీ దూకుడుగా ముందుకు వెళ్తున్నారని అంటున్నారు పరిశీలకులు. అదే సమయంలో ఆమె టార్గెట్‌లు కూడా చాలా పెద్దగానే ఉన్నాయని చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఇద్దరు మంత్రుల కూర్పులో బీసీ కోటాలో తనకు ఛాన్స్ దక్కించుకునేందుకు తుది వరకు కూడా ఆమె ప్రయత్నాలు సాగించారని అంటున్నారు. అయితే, ఈ ఛాన్స్ మిస్సవడంతో వచ్చే ఏడాది తర్వాత జరిగే మంత్రి వర్గం విస్తరణలో తనకు బెర్త్ దక్కించుకునేందుకు ఇప్పటి నుంచే ఇలా ప్రచార పర్వంలో దూసుకుపోతే.. బెటరని ఆమె ఆలోచిస్తున్నట్టుగా కనిపిస్తోందని అంటున్నారు పరిశీలకులు.

## ముందస్తుతో టీడీపీకి ముప్పేనా



విజయవాడ, ఆగస్టు 26, (న్యూస్ పల్స్)మరో మారు దేశంలో జమిలి ఎన్నికల గురించి చర్చ సాగుతోంది. నిజానికి గత అయిదారేళ్ళుగా జమిలి ఎన్నికలూ అంటూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెగ ఊదరగొడుతోంది. కానీ భారత్ లాంటి అతి పెద్ద దేశంలో ఒకేసారి పార్లమెంట్ కి అసెంబ్లీకి ఎన్నికలు జరిపించడం అంటే మామూలు విషయం కాదు. ఎన్నో ప్రాంతాలు, భాషాలు, అన్నింటికీ మించి రాజకీయ పార్టీలు ఉన్న దేశంలో ఒకే ఎన్నిక అంటే అది పెద్ద రికార్డే అవుతుంది. అయితే కేంద్రంలో ఉన్నది బీజేపీ. దానికి నాయకుడు మోడీ. ఆయన ఎన్నో అసాధ్యాలను సుసాధ్యం చేశారు కాబట్టి జమిలి ఎన్నికలు దేశాన వచ్చినా ఆశ్చర్యం లేదు అంటున్నారు. అదే జరిగితే ఏపీలో రాజకీయ వాతావరణం ఎలా ఉంటుంది అన్నదే చర్చ. ఏపీలో రెండున్నరేళ్ళ క్రితం జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓడి కుదేలయింది. కేవలం 23 సీట్లు మాత్రమే ఆ పార్టీకి వచ్చాయి. రెండేళ్ళుగా ఏపీలో ప్రతిపక్ష పాత్ర సవ్యంగా నిర్వహించడంలో టీడీపీ విఫలం అయింది అనే భావన ఉంది. ఏపీ వరకూ చూస్తే టీడీపీ ఒంటరి పోరాటం చేస్తోంది. ఈ రోజుకీ పొత్తులు కుదరలేదు. బీజేపీ దూరం పెడుతూంటే జనసేన నుంచి గ్రీన్ సిగ్నల్స్ రావడంలేదు. ఓ వైపు రోజు రోజుకు ఏపీలో టీడీపీ గ్రాఫ్ దిగజారుతూ వస్తోంది. ఈ క్రమంలోనే పార్టీలో జోష్ నింపేందుకు చంద్రబాబు గత యేడాది నుంచి జమిలీ అంటూ పెద్ద ఎత్తున హడావిడి చేస్తున్నారు. జమిలీ వస్తే మేం గెలిచేస్తాం అంటూ టీడీపీ నేతలు కూడా ఒక్కటే హంగామా చేస్తున్నారు. మరి గందరగోళం అయోమయంగా ఉన్న రాజకీయ వాతావరణంలో జమిలి అంటే టీడీపీ సన్నద్ధం కాగలదా ? అన్నది చర్చగా ఉంది. ఇంకో వైపు చూస్తే ఈ రోజుకీ ఏపీలో వైసీపీకి ఆదరణ ఉంది. కరోనా వంటి విషమ పరిస్థితులు ఉన్నా కూడా ఏపీలో సంక్షేమాన్ని జగన్ అసలు ఆపడంలేదు. సామాన్య, మధ్య తరగతి వర్గాల్లో ఈ కష్టాల్లో కూడా జగన్ డబ్బులు ఇవ్వడం ఆపలేదుగా ? అని చర్చించుకుంటున్నారు. దాంతో జగన్ తనకంటూ ఓటు బ్యాంక్ ని పటిష్టం చేసుకుని ముందుకు సాగుతున్నారు. అందువల్ల 2024 నాటికి ఎన్నికలు వస్తే ప్రభుత్వం మీద ఎంతో కొంత వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుంది కానీ ఇప్పటికిపుడు ఎన్నికలు అంటే మాత్రం టీడీపీ అసలు తట్టుకోలేదు అంటున్నారు. పైగా టీడీపీలో ఇప్పటికీ చాలా నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు సరైన అభ్యర్థులు లేని పరిస్థితి. ఒక విధంగా కేంద్రంలోని బీజేపీకి, ఏపీలోని వైసీపీకి కూడా ఈ జమిలి ఎన్నికల వల్ల భారీ లాభం కలుగుతుంది అన్న విశ్లేషణలు ఉన్నాయి. జమిలీతో ఏదే పొడిచేస్తాం అన్న ఊహల్లో ఉన్న టీడీపీకి నిజంగా ఎన్నికలు వస్తే మునుగుతాం ? అన్న వాస్తవం అయితే బోధపడట్లేదు.

## ఏపీలో టీడీపీ కాంగ్రెస్... పొత్తు..?

విజయవాడ, ఆగస్టు 26, (న్యూస్ పల్స్)కాంగ్రెస్ కు కొంత దేశ వ్యాప్తంగా అనుకూల వాతావరణం కన్పిస్తుంది. అయితే ఒంటరిగా పోటీ చేయలేకపోయినా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పొత్తుతోనే గెలుపు గుర్రం ఎక్కే అవకాశాలు కన్పిస్తున్నాయి. మోదీపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను ఈసారి ఖచ్చితంగా సొంతం చేసుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తుంది. అందుకోసం అన్ని రాష్ట్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ప్రతి రాష్ట్రంలో లోక్ సభలో కొన్ని సీట్లను సొంతం చేసుకునే దిశగా కాంగ్రెస్ పార్టీ ప్లాన్ చేస్తున్నట్లు కన్పిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అడుగంటి పోయింది. దాని ఓటు బ్యాంకు కూడా జగన్ ఎగరేసుకు పోవడంతో మళ్లీ మొదటి నుంచి మొదలు పెట్టాల్సి ఉంది. రాష్ట్రాన్ని ఏకపక్షంగా విభజించడంతో ఏపీలో కాంగ్రెస్ పట్ల ప్రజల ఆగ్రహం ఇంకా చల్లార లేదు. ప్రత్యేక హోదా హామీతో మరోసారి వారిని ప్రసన్నం చేసుకోవాలని భావిస్తున్నారు. ఇందుకోసం వచ్చే ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకునే దిశగానే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. టీడీపీ బీజేపీతో కలవని పరిస్థి?తి. తాము అసెంబ్లీ సీట్ల కంటే పార్లమెంటు స్థానాలు అత్యధికంగా ఇస్తే చాలన్న ఒప్పందంతో టీడీపీ అధినేత చంద్రబాబును కలవాలని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం భావిస్తుంది. అందుకే ఈ నెల చివరిలో పార్టీ సీనియర్ నేతలతో రాహుల్ గాంధీ సమావేశం అవుతున్నారు. ఇందులో రాజకీయాలకు గత రెండేళ్ల నుంచి దూరంగా ఉంటున్న రఘువీరారెడ్డిని సయితం ఆహ్వానించారు. పాత



నేతలను తిరిగి పార్లమెంటుకు పోటీ చేయాలన్న ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ ఉంది. వ్యక్తిగత ఇమేజ్ ఉండటంతో అది టీడీపీకి కూడా ఉపయోగపడుతుందని, పార్లమెంటు ఎన్నికలకు సీనియర్లు పోటీ చేస్తే టీడీపీకి అసెంబ్లీ ఎన్నికల్లోనూ లాభిస్తుందని కాంగ్రెస్ హైకమాండ్ అంచనా వేస్తుంది. దీనిపై పూర్తి స్థాయిలో చర్చించిన తర్వాత చంద్రబాబు వద్దకు రాయబారం పంపాలన్నది కాంగ్రెస్ పార్టీ ఆలోచనగా ఉంది. మొత్తం మీద కేంద్రంలో అధికారంలోకి రావడం కోసం వీక్ గా ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ కొత్త ఎత్తుగడలకు దిగుతుంది.

## ఏపీలో నెంబర్ 2 గా భారతి

గుంటూరు, ఆగస్టు 26, (న్యూస్ పల్స్)ఏపీలో ముందస్తు ఎన్నికలు వస్తాయా ? ఒకప్పుడు 2018లో తెలంగాణలో వచ్చినట్టుగానే ముందస్తుకు ఏపీ సర్కారు కూడా మొగ్గు చూపుతోందా ? ప్రస్తుతం ప్రతిపక్షాలు, ప్రభుత్వ వ్యతిరేక మీడియా చేస్తున్న తీవ్ర వ్యతిరేక ప్రచారం నుంచి బయట పడేందుకు జగన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన చేస్తున్నారా? అంటే.. వైసీపీ వర్గాలు కూడా లోలోన అవుననే సమాధానమే ఇస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమీ బాగోలేదని.. జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఏపీ అప్పుల ఊబిలోకి జారుతోందని.. ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్తున్నాయి. దీనికి ప్రభుత్వ వ్యతిరేక మీడియా కూడా ప్రచారం చేస్తోంది. దీని నుంచి తప్పించుకునేందుకు జగన్ ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేయాలో.. ఎన్ని ప్రకటనలు ఇవ్వాలో అన్నీ ఇస్తోంది. అయితే.. ఎక్కడా ప్రతిపక్షాలు వెనక్కి తగ్గడం లేదు. రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీని విధించే పరిస్థితి వస్తోందని.. ఇదే జరిగితే.. ఏపీకి ఇంతకన్నా అవమానం లేదని.. ప్రతిపక్ష టీడీపీనేతలు ప్రచారం చేస్తున్నారు. అదేసమయంలో జగన్ తీసుకున్న అనేక నిర్ణయాలను ఎండగడుతున్నారు. సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు నిధులను నేరుగా ఇస్తున్నందునే రాష్ట్రం అప్పుల పాలవుతోందని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జగన్ ప్రభుత్వంపై విమర్శల దాడిని పెంచారు. మరి ఈ పరిస్థితి నుంచి జగన్ బయటపడే మార్గం, ప్రతిపక్షాల నోటికి తాళం వేసే మార్గం.. ఒక్కటేనని సీఎం భావిస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో తెలంగాణ సర్కారు కూడా ప్రతిపక్షాల నోటికి తాళం వేయాలంటే.. ఎన్నికలకు వెళ్లాల్సిందేనని నిర్ణయించి.. ముందస్తుకు వెళ్లి విజయం దక్కించుకుంది. ఇదే సూత్రాన్ని ఏపీలోనూ అమలు చేయాలని.. ప్రజలు తనవైపు ఉన్నారో.. ప్రతిపక్షాల వైపు ఉన్నారో తేల్చుకునేందుకు ఇదే సరైన సమయమని జగన్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే జగన్ తన సర్కారును మరో యేడాది టైంలో రద్దు చేసినా.. ఆశ్చర్యం లేదనే సంకేతాలు వస్తున్నాయి. అదే సమయంలో తన సతీమణిని భారతిని కూడా నేరుగా రాజకీయాల్లోకి తీసుకువచ్చి.. తన తర్వాత.. నెంబర్ 2 చేయాలనే ఆలోచన జగన్ చేస్తున్నట్టు ప్రచారం ఒకటి తెరమీదికి వచ్చింది.

## ఏపీ బీజేపీలోనూ పాదయాత్ర..?

విజయవాడ, ఆగస్టు 26, (న్యూస్ పల్స్)ఏపీ బీజేపీని బలోపేతం చేయడం ఇప్పుడు పార్టీ నేతలపై కేంద్రంలోని బీజేపీ పెద్దలు పెట్టిన పెద్ద టాస్క్. "మీరు ఏం చేస్తారో.. తెలీదు. పొరుగున ఉన్న కర్ణాటకలో చూడండి.. పార్టీ అధికారంలోకి వచ్చింది. మరిమీకు అన్ని వనరులు ఇస్తున్నాం. పదవులు ఇస్తున్నాం. మీరు స్పందించకపోతే.. కష్టం. మీరు ఏం చేసినా.. పార్టీని బలోపేతం చేయాలి"-ఇదీ.. ఇటీవల కేంద్ర బీజేపీ చీఫ్ జేపీ నడ్డా నుంచి ఏపీ బీజేపీ నేతలకు అందిన సమాచారం. దీంతో ఏపీలో ఏదో ఒక ప్లాన్ చేసి పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నాయకులు ధృఢంగా నిర్ణయించుకున్నారు. దీనిపై పెద్ద ఎత్తున కసరత్తు కూడా చేశారు. ఈ క్రమంలోనే పాదయాత్ర చేయాలని కొందరు సీనియర్లు సూచించారు. అయితే.. దీనికి ఎవరు ముందుకు వస్తారు ? ఎలా ముందుకు వెళ్లాలి ? అనే విషయంపై మాత్రం సందేహాలు నెలకొన్నాయి. ఎందుకంటే.. పాదయాత్ర అనగానే.. చాలా మంది నోరెళ్ల బెట్టారని సమాచారం. పైగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ.. పాదయాత్ర చేయడం ఎందుకు? ఏపీకి కావాల్సిన నిధులు.. ఇతర సమస్యల పరిష్కారంపై దృష్టి పెడితే.. మంచిదని రాష్ట్ర బీజేపీ చీఫ్ సోము వీర్రాజు చెప్పినట్టు తెలుస్తోంది. అయితే.. కేంద్రం మాత్రం ఏపీ విషయంలో ఇవేవీ ఇవ్వకుండానే పార్టీని అధికారంలోకి తీసుకురావాలని సూచిస్తోంది. అయినప్పటికీ.. ఇప్పుడున్న పొజిషన్‌లో బీజేపీ రాష్ట్రంలో బలపడాలంటే.. ఖచ్చితంగా ఫ్లాగ్ షిప్ కార్యక్రమం చేపట్టాలని యువ నేతలు సూచిస్తున్నారు. దీనిపై నేతల మధ్య తర్జన భర్జన సాగుతున్న మాట వాస్తవం. ఏదో మీడియా ముందుకువ చ్చి.. రెండు మూడు విమర్శలు చేయడం , తర్వాత సైలెంట్ అయిపోవడం వల్ల ప్రయోజనం లేదనేది యువ నేతలు ఖచ్చితంగా చెబుతున్నారు. అయితే.. జిల్లాల వారీగా పాదయాత్ర చేయడం మంచిదని మరికొందరు సూచిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దీనినివాయిదా వేసి.. జనవరి తర్వాత.. నిర్ణయం తీసుకుంటే మంచిదని.. మాజీ చీఫ్ సలహా ఇచ్చారట. మొత్తానికి పాదయాత్రపై బీజేపీలో పెద్ద ఎత్తున సమాలోచనలు అయితే.. జరిగాయి. దీనిపై నిర్ణయం మాత్రం తీసుకోవాల్సి ఉందని అంటున్నారు. మరి చివరికి ఏం చేస్తారో చూడాలి. ఇక్కడ చిత్రం ఏంటంటే.. గతంలో పార్టీ చీఫ్‌గా ఉన్న కన్నా లక్ష్మీనారాయణ కూడా ఇదే ప్రతిపాదన చేసినప్పుడు.. వ్యతిరేకించిన ఒకరిద్దరు నేతలు ఇప్పుడు యాత్రకు మొగ్గు చూపడం. దీంతో బీజేపీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఏ రేంజ్‌లో ఉందో అర్థమవుతోందని అంటున్నారు పరిశీలకులు.

## కొల్లేరులో చేపల కరువు

ఏలూరు, ఆగస్టు 25, (న్యూస్ పల్స్)కొల్లేరు ప్రాంత చేపల రైతుల కొంప కొల్లేరయ్యింది.. ఎడతెగని వర్షాలకు వాగులు డ్రెయిన్లు ఉగ్రరూపం దాల్చడంతో వచ్చిపడుతున్న వరద నీరు చేపల చెరువుల పాలిట ఆశనిపాతంగా మారింది. నీటి ఉధృతికి గట్లు తెగిపోతుండటంతో చెరువుల్లో ఉన్న మత్స్య సంపదను కాపాడుకోలేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. భారీ వర్షాలకు పై నుండి వస్తున్న వరద నీరు చేపల రైతులను నిలువెల్లా ముంచెత్తింది. 13 ఏళ్ల క్రితం ఇదే తరహాలో వచ్చిన వరదలకు కొల్లేటి ప్రాంత చేపల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం మళ్లీ అదే పరిస్థితి కనిపిస్తోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు అన్ని ప్రాంతాలు దాదాపుగా వర్షపునీటితో నిండిపోతున్నాయి. బుడమేరు, తమ్మిలేరుకు ఉధృతంగా వస్తున్న వరద కారణంగా ఆ నీరంతా కొల్లేరు సరస్సులో చేరుతోంది. అయితే సరస్సు పరిమాణం కుచించుకుపోవడం, అన్నీ చేపల చెరువులుగా మారిపోవడంతో ఆ నీరంతా చెరువుల్లోకి చేరిపోతోంది. దీనితో దాదాపు చెరువులన్నీ నిండు కుండల్లా గట్లను తాకుతూ ప్రవహిస్తున్నాయి. చెరువుల నుండి చేపలు బయటకు వెళ్లిపోకుండా గట్ల చుట్టూ వలలు ఏర్పాటుచేసి రైతులు రక్షణ చర్యలు చేపడుతున్నారు. అయితే వరద ఉధృతి అంతకంతకు పెరిగిపోతుండటంతో పలు చెరువుల గట్లు తెగిపోతున్నాయి. ఫలితంగా కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని కొల్లేటి ప్రాంతంలో సాగుచేస్తున్న వేలాది ఎకరాల చెరువుల్లోని మత్స్యసంపద నీటిపాలవుతోంది. అయితే వరద ఉధృతి తగ్గితే గానీ నష్టం ఎంతమేర ఉంటుందనేది చెప్పలేమన్నారు. గట్లు తెగిన చెరువుల నుండి చేపలు నేరుగా ఉప్పుటేరులోకి వస్తున్నాయి. దీంతో దుంపగడప శివారు పల్లెపాలెం, కృష్ణాజిల్లా పరిధిలోని జంగంపాడుకు చెందిన మత్స్యకారులు పెద్దఎత్తున వీటిని వేటాడే ప్రయత్నంలో తలమునకలవుతున్నారు. తాటి దోనెలపై వలలతో వేటాడుతున్నారు. బుధవారం నుంచి ఇదే తరహాలో చేపలు పడుతున్నప్పటికీ, ఒక్కరోజే దాదాపుగా నాలుగు టన్నుల మేర చేపలు దొరికినట్టు సమాచారం. ప్రస్తుతం చేపల ధర కేజీ రూ.110 పలుకుతోంది. అయితే మత్స్యకారులు పట్టిన చేపలను గురువారం ఉదయం వ్యాపారులు తొలుత కిలో రూ.70కి కొనుగోలు చేశారు. మత్స్యకారుల నుండి భారీగా చేపలు వస్తుండటంతో మధ్యాహ్ననికి వీటి ధర కిలో రూ.30కి పడిపోయింది. వీటిని కొనుగోలు చేసేందుకు చేపల వ్యాపారులు పల్లెపాలెం రేవు వద్ద ప్రత్యేక కాటాను ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి కొనుగోలు చేసిన చేపలను ఐషర్ వాహనాల ద్వారా ఆకివీడు చేపల మార్కెట్‌కు తరలిస్తున్నారు. 300సైజు నుండి కేజీన్నర వరకు చేపలు భారీగా వలల్లో పడ్డాయి. అయితే ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మత్స్యకారులు చాలా శ్రమిస్తున్నారు.

## కరోనా ఆరోగ్య ఖర్చు రూ.350 కోట్లు

విజయవాడ, ఆగస్టు 25, (న్యూస్ పల్స్)రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలపై అనేక సందేహాలు లేవనెత్తుతున్న అక్కౌంటెంట్ జనరల్ (ఎజి) కార్యాలయం తాజాగా కరోనా వైరస్ నివారణకు చేసిన ఖర్చుపైనా అనేక ప్రశ్నలు వేసింది. రాష్ట్రం చేస్తున్న అప్పులు, బ్యాంకు ఖాతాలు, ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించి అక్కౌంటెంట్ జనరల్ (ఎజి) కార్యాలయం ఇప్పటికే అనేక ప్రశ్నలు వేసిన విషయం తెలిసిందే. కరోనా వైరస్ నియంత్రణకు చేసిన ఖర్చుకు సంబంధించి పూర్తి వివరాలు అందచేయాలంటూ ఆ కార్యాలయం నుండి గురువారం మరో లేఖ రాష్ట్ర ప్రభుత్వానికి అందింది. ఈ వివరాలను నమోదుచేయడానికి ప్రత్యేకంగా ఒక నమూనాను కూడా పంపించింది. వైరస్ నివారణ, నియంత్రణ కోసం ఎంత నిధులు ఖర్చు చేశారు? వాటిలో రాష్ట్ర నిధులు ఎంత? కేంద్ర నిధులు ఎంత? ఆ నిధులు ఖజానాలో ఉంచి ఖర్చు చేశారా? బ్యాంకుల్లో ఉంచి ఖర్చు చేశారా? బ్యాంకులైతే రిజర్వు బ్యాంకు అనుమతిచ్చిన బ్యాంకులా.. ఇతర బ్యాంకులా వంటి వివరాలను ఎజి కార్యాలయం అడిగినట్లు తెలిసింది. ఇదే కాకుండా నిధులను ప్రభుత్వ ఖాతాల్లో ఉంచి ఖర్చు చేశారా? బయటి ఖాతాల్లో ఉంచి ఖర్చు చేశారా? బయటి ఖాతాల్లోనైతే అలా ఎందుకు చేశారు? మొత్తం ఖర్చులో పెట్టుబడి వ్యయం ఎంత? రెవిన్యూ వ్యయం ఎంత వంటి ప్రశ్నలు కూడా ఉన్నట్లు సమాచారం. కరోనా కారణంగా ఒక్క వైద్య రంగానికే నెలకు సగటున 350 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మెడికల్ కిట్లు, పిపిఇ కిట్లు, క్వారెంటైన్ కేంద్రాల నిర్వహణ తదితర వాటికి భారీగానే నిధులు ఖర్చు అయ్యాయని అంటున్నారు. అదే సమయంలో ఇంటింటికి రేషన్, వైరస్ బారిన పడిన వారికి ఆర్థికసాయం తదితర అంశాలకు కూడా భారీగా ఖర్చు అయిందని చెబుతున్నారు. ఎజి కార్యాలయం నుండి వరుసగా అందుతున్న ఈ లేఖలు అధికార యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారుతున్నాయి.

# లోకసభకు ఆదిరెడ్డి భవానీ....

రాజమండ్రి, ఆగస్టు 26, (న్యూస్ పల్స్)ఏపీలో ప్రధాన ప్రతిపక్షం టీడీపీలో పదవులు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లను భర్తీ చేస్తున్నారు పార్టీ అధినేత చంద్రబాబు. గత ఎన్నికల తర్వాత ఖాళీ అయిన నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లుగా కొత్తవారిని నియమిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ సారి లోక్‌సభకు పార్టీ నుంచి యువత, ఉన్నత విద్యావంతులను రంగంలోకి దింపే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. నరసారావుపేట ఎంపీ సీటుకు రాజధాని ఉద్యమంలో యాక్టివ్‌గా ఉంటోన్న రాయపాటి శైలజ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇక ఏలూరు నుంచి యువ పారిశ్రామికవేత్త పేరు రేసులో ఉంది. ఈ క్రమంలోనే రెండు గోదావరి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న రాజమహేంద్రవరం లోక్‌సభ సీటు నుంచి రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ పేరు పార్టీ ఇన్నర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఆదిరెడ్డి భవానీని ఎమ్మెల్యేగా కాకుండా ఎంపీగా పోటీ చేయించాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.గత ఎన్నికల్లో తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగిన ఆదిరెడ్డి భవానీ పార్టీ చిత్తుగా ఓడిపోయినా కూడా ఏకంగా 30 వేల ఓట్ల పైచిలుకు భారీ మెజార్టీతో విజయం సాధించి సంచలనం క్రియేట్ చేశారు. ఎర్రన్నాయుడు కుమార్తెగా ఉన్న క్లీన్ ఇమేజ్, ఇటు రాజమండ్రిలో ఆదిరెడ్డి ఫ్యామిలీకి ఉన్న పట్టు ఇవన్నీ ఆదిరెడ్డి భవానీకి కలిసి వచ్చాయి. పైగా టీడీపీ నుంచి అసెంబ్లీలో ఉన్న ఏకైక మహిళా ఎమ్మెల్యే ఆమే కావడం విశేషం. అయితే పార్టీ వాయిస్‌ను ఆమె అంది పుచ్చుకోలేక పోతున్నారన్న చర్చలు ఇన్నర్‌గా ఉన్నాయి. అటు అసెంబ్లీలోనూ, బయటా ఆదిరెడ్డి భవానీ వాయిస్సే వినపడదు.ఇక నియోజకవర్గంలో పెత్తనం అంతా ఆదిరెడ్డి భవానీ భర్త ఆదిరెడ్డి వాసు చేసేస్తున్నారు. భవానీ పూర్తిగా చేయడానికేం లేదు. ఇక ఉన్నత విద్యావంతు రాలు కావడం, మహిళ కావడంతో ఆమె సేవలను లోక్‌సభలో వాడుకుంటే బాగుంటుందని కొందరు పార్టీ నేతలు బాబు దృష్టికి తీసుకు వెళ్లారు. చంద్రబాబు సైతం ఆమెను లోక్‌సభకు పోటీ చేయించేందుకే ఆసక్తితో ఉన్నట్టు తెలిసింది. ఇక గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి కమ్మ వర్గానికి చెందిన మాగంటి రూప పోటీ చేసి ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో జగన్ ఇక్కడ బీసీ వర్గానికి చెందిన మార్గాని భరత్‌కు సీటు ఇవ్వడంతో పాటు బీసీ ఫ్యాక్టర్‌ను బాగా ప్రచారం చేసి సక్సెస్ అయ్యారు.ఇక గత ఎన్నికల్లో ఇక్కడ ఓడిన మాగంటి రూప తిరిగి రాజకీయాల్లోకి వచ్చేందుకు ఆసక్తితో లేరని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఇప్పుడు చంద్రబాబు సైతం అదే బీసీ ఫ్యాక్టర్‌ను ఇక్కడ వాడాలని ఆదిరెడ్డి భవానీ పేరును తెరమీదకు తీసుకు వస్తోన్న పరిస్థితి. అయితే భవానీకి ఎంపీ సీటు ఇచ్చే విషయంలో రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరికి మాత్రం ఇష్టం లేదని టాక్ ? ఇప్పటికే అక్కడ ఆధిపత్య పోరు నడుస్తోంది. పైగా రేపటి రోజు ఆదిరెడ్డి భవానీ ఎంపీగా, ఆమె భర్త వాసు సిటీ ఎమ్మెల్యేగా ఉంటే తన డామినేషన్‌కు ఎక్కడ బ్రేక్ పడుతుందో ? అన్న టెన్షన్ బుచ్చయ్యలో అప్పుడే మొదలైందని అంటున్నారు. ఏదేమైనా రాజమండ్రి టీడీపీ రాజకీయం అయితే రంజుగానే ఉంది.

# సీబీఐ, ఈడీ కేసుల సత్వర విచారణ శుభపరిణామం



### రాజకీయాల్లో నేరస్తుల్ని నిలువరించినప్పుడే అసలైన ప్రజాస్వామ్యం
### యనమల రామకృష్ణుడు

అమరావతిఆగస్టు 26, (న్యూస్ పల్స్)ప్రజాప్రతినిధులపై ఉన్న క్రిమినల్ కేసుల్లో విచారణ జాప్యం ప్రజాస్వామ్యా ఉనికికే ప్రమాదకరం. ప్రజాప్రతినిధులపై కేసుల విచారణను వీలైనంత త్వరగా పూర్తి చేసి, నేరస్తులకు శిక్ష పడినపుడే భావితరాలకు ఆదర్శవంతమైన సమాజాన్ని అందించగలమని శాసన మండలి ప్రతిపక్షనేత, పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. రాష్ట్రంలోనే దాదాపు 138 సీబీఐ, ఈడీ కేసులు దశాబ్ద కాలానికి పైగా వివిధ దశల్లో పెండింగులో ఉన్నాయి. ఈ విషయాన్ని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఇచ్చిన నివేదిక మేరకు అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సుప్రీంకు తెలిపారు. మన రాష్ట్రంలో పెండింగులో కొన్ని కేసుల విచారణలో అసాధారణ జాప్యం జరుగుతోందని కూడా వెల్లడించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి ప్రధాన విఘాతాలుగా తయారయ్యాయి. రాజకీయాల్లో నేరస్తుల్ని నిలువరించే విషయంలో సుప్రీంకోర్టు చొరవ దేశంలో ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్ట పరుస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అధికారం ఎన్నికల ప్రక్రియ ద్వారా.. ప్రజాప్రతినిధుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఓట్లు వేసి ఎన్నుకున్న ప్రజలు తమ ప్రజాప్రతినిధి అధికార దుర్వినియోగం, అక్రమాలు ప్రజలకు తెలిసినపుడే మార్పు మొదలవుతుంది. చట్ట సభల్లోకి నేరస్తులు, ఆర్థిక ఉగ్రవాదులు అడుగు పెట్టకుండా అడ్డుకోగలుగుతాం. అమికస్ క్యూరీ సూచన మేరకు క్రిమినల్, సీబీఐ, ఈడీ కేసుల్లో విచారణను పర్యవేక్షించేందుకు వీలైనంత త్వరగా కమిటీ ఏర్పాటు చేయాలి. శిక్షలు పడిన వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవిత కాలం నిషేధం విధించేలా పార్లమెంటు చొరవ తీసుకోవాలి. ఎన్నికల ప్రక్రియలోనే నేరస్తులు చట్ట సభల్లో అడుగు పెట్టకుండా అడ్డుకోవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థను పారదర్శకంగా, స్వచ్ఛంగా తయారు చేయాలంటే.. వారిని నిరోధించే చట్టాలు కూడా అంతే పకడ్బందీగా ఉండాలి. రాజకీయాల్లోకి నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులు రాకుండా నిరోధించినపుడే ప్రజాసంపద, ప్రకృతి వనరులు కాపాడగలం. అదే సమయంలో ప్రభుత్వ నిర్ణయాలు కూడా పారదర్శకంగా ఉంటాయి. అధికారాన్ని ఉపయోగించి నల్లధనం కూడబెట్టే ప్రక్రియను నిలువరించగలం. సమాజంలో రాజకీయ-ఆర్థిక-సామాజిక అసమానతలను తగ్గించి.. సమాజాభివృద్ధికి తోడ్పడగలం. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడగలమని అయన అన్నారు.

# తృటిలో తప్పిన ఘోర రోడ్డు ప్రమాదం

విశాఖ ఆగస్టు 26, (న్యూస్ పల్స్)నక్కపల్లి పోలీస్ స్టేషన్ ఎదురు గా తృటిలో ఘోర రోడ్డు ప్రమాధం తప్పింది. జాతీయ రహదారిపై వుంచిన స్టాపర్స్ కారణంగా ఐదు వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఊహించని ప్రమాధం జరిగినప్పటికీ ఎటువంటి ప్రాణహాని లేకపోవటంతో అక్కడ వున్నవారంతా ఊపిరి పీల్చుకున్నారు.ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకెళితే నక్కపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగావున్న జాతీయ రహదారిపై మరమ్మతులు చేపట్టేందుకు నేషనల్ హైవే అథారటీ సిబ్బంది వాహనాలను క్రమబద్దీకరించేందుకు బుధవారం మధ్యాహ్నం హైవేపై స్టాపర్స్ ను ఏర్పాటు చేసారు. ఈ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా తూర్పుగోదావరి జిల్లా నుంచి విశాఖపట్నం వైపు లారీ వేగంగా ప్రయాణిస్తూ రహదారి పై వున్న స్టాపర్స్ ను ఢీ కొనకుండా వుండేందుకు డ్రైవర్ తన వాహనానికి సడన్ బ్రేక్ వేయటంతో వాహనం రహదారి మధ్యలో ఆగిపోయింది. ఇదే మార్గంలో లారీ వెనుక వేగంగా ప్రయాణిస్తున్న కారు ముందు వెళుచున్న లారీ అకస్మాత్తుగా రహదారిపై నిలిచిపోవటంతో వెనుకనుంచి లారీని ఢీ కొట్టింది. ఈ కారు వెనక వస్తున్న మరో కారు,ఆ కారు వెనుక వస్తున్న మరో కారు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఇదే క్రమంలో కారు వెనుక వెనక వస్తున్న లారీ ముందు వెళుచున్న కారును ఢీకొట్టగా అప్పటికే ముందు వాహనాన్ని ఢీకొన్న కారుకు వెనుకనుంచి లారీ ఢీకొనటంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికు లు తప్పించుకునే ప్రయత్నం చేయగా అప్పటికే వాహనం డోర్లు, విండోస్ లాకయిపోయాయి. దీంతో వాహనంలోవున్నవారంతా ప్రాణభయంతో ఆక్సిజన్ అందక ఆర్తకారాలు చేయసాగారు. ఈ ప్రమాధాన్ని సమిపం నుంచి గమనిస్తున్న స్థానికులు, పోలీసులు అప్రమత్తమై వాహనం వద్దకు చేరుకుని ప్రయాణికులను రక్షించటానికి డోర్లు తీయటానికి ప్రయత్నించగా కారు తలుపులు ,విండోస్ ఓపెన్ కాలేదు. దీంతో కారు అద్దాలు పగులకొట్టి వాహనంలో వున్ నలుగురిని బయటకు తీయటంతో వారంతా ప్రాణాలతో బయటపడ్డారు. అచ్చం సినిమా పక్కీలో జరిగిన ఈ ప్రమాధం చివరకు ఎటువంటి ప్రాణహాని లేకుండా సుఖాంతమవటంతో పోలీసులతోపాటు అక్కడ వున్నవారంతా ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులు , స్వచ్ఛంద సేవా సంస్థలు సమన్వయంతో విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ చక్రధర బాబు పిలుపు

నెల్లూరు ఆగస్టు 26, (న్యూస్ పల్స్ జిల్లాలో చేపడుతున్న ప్రభుత్వ కార్యక్రమాలను ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పిలుపునిచ్చారు. గురువారం శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో, ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సమన్వయ కేంద్రాన్ని (జీవో- ఎన్జీవో కోఆర్డినేషన్ సెంటర్) కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల పట్ల ప్రజలను చైతన్యం చేయడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమన్నారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ప్రజాసేవే పరమావధిగా భావించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని సూచించారు. జిల్లాలో 70 స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. కరోనా వ్యాక్సినేషన్, జగనన్న పచ్చ తోరణం పథకాల అమలులో స్వచ్ఛంద సంస్థలు ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. మారుమూల గ్రామాల్లో కూడా కరోనాపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కోవిడ్ థర్డ్ వేవ్ హెచ్చరిక నేపథ్యంలో స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా పనిచేసి జిల్లాను కరోనా రహిత జిల్లాగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు కూడా కరోనా నిబంధనలను ఒక అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగాజాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఈ కేంద్రాన్ని కలెక్టర్ ప్రత్యేక చొరవతో నెల్లూరులో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కేంద్రాన్ని స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు ఉపయోగించుకొని, ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని కోరారు. అనంతరం పలువురు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి ధనలక్ష్మి, డిఆర్డిఎ పిడి సాంబ శివారెడ్డి, డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ మహేంద్ర రెడ్డి, స్వచ్ఛంద సంస్థల కోఆర్డినేటర్ కే. సహదేవయ్య, కమాండింగ్ ఆఫీసర్ యుగంధర్ రెడ్డి, సెట్నల్ సీఈవో పుల్లయ్య, పలువురు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# లారీని ఢీకొట్టిన బస్సు

నందిగామఆగస్టు 26, (న్యూస్ పల్స్)కృష్ణా జిల్లా నందిగామ శివారు అనాసాగరం నూతన జాతీయ రహదారి ఫ్లై ఓవర్ పై తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుండి యానం వెళ్తున్న కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్ 38 మంది ప్రయాణికులతో ప్రయాణిస్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల నిద్ర మత్తులో అతివేగాన్ని అదుపు చేయలేక ఇనుప సువ్వల లోడ్ తో ముందు వెళుతున్న లారీని కావేరి ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొన్నది. ఈ ఘటనలో ముగ్గురుకు ప్రయాణికులకు గాయాలు కాగా డ్రైవర్ కి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 108 వాహనం ద్వారా గాయాలైన వారిని నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ప్రయాణికులకి ఏలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరో బస్సులో మిగిలిన 34 మందిని వారివారి గమ్యస్థానానికి పోలీసులు చేర్చారు. కేవలం డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల, నిద్ర మత్తులో అతివేగం అదుపు చేయలేక లారీని ఢీకొన్నట్లుగా ప్రయాణికులు తెలుపుతున్నారు.

# కలెక్టర్ ఆదేశాలను అమలు చేయని ఎమ్మార్వో పై తగిన చర్యలు తీసుకోవాలి

### ఆక్రమణదారుల చెర నుంచి మా జీవనాధార భూమిని కాపాడాలి

నెల్లూరు ఆగస్టు 26, (న్యూస్ పల్స్)జిల్లా కలెక్టర్ ఆదేశాలను అమలు చేయని నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం తాసిల్దార్ పై చట్ట రీత్యా తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు తాటిపర్తి సుబ్బయ్య ,నవనీతమ్మ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ నందు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాచలం మండలం పరిధిలోని కనుపూరు గ్రామం సర్వే నంబర్144/7 లోని ఒక ఎకరా ఒక్క సెంటు వ్యవసాయ సి జె ఎఫ్ ఎస్ భూమిని ప్రభుత్వం తమకు మంజూరు చేసిందని తెలిపారు. కాలక్రమేణా తమ కుటుంబ ఆర్థిక స్థితిగతుల గురించి గ్రామంలోని రాయపునేని సుబ్బమ్మ దగ్గర 4 దఫాలుగా 27 వేల రూపాయలను అప్పుగా తీసుకోవడం జరిగిందన్నారు. అప్పు చెల్లించడంలో జాప్యం జరిగినప్పటికీ, సుబ్బమ్మ కు ఆమె అప్పు తీర్చేందుకు ఆమె ఇంటికి వెళ్ళమని చెప్పారు. అంతట ఆమె మాట్లాడుతూ మీరు తీసుకున్న అసలు మరియు వడ్డీ కలిపి 8 లక్షలు చెల్లించాలని చెప్పడంతో అవాక్కయ్యామన్నారు. ఈ విషయమై కోర్టులో కేసు నడుస్తుందన్నారు. ఇదిలా ఉండగా 2019లో రెవెన్యూ రికార్డుల్లో తాటిపర్తి సుబ్బయ్య అనే పేరు లేదని అధికారులు చెప్పడంతో జిల్లా కలెక్టర్ ను కలవడం జరిగిందన్నారు. స్పందించిన కలెక్టర్ మా పొలం మాకు నూటికి నూరు శాతం హక్కుగా ఉందని గుర్తించి, ఈ సమస్యను పరిష్కరించమని స్థానిక మండల ఎమ్మార్వో కు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎమ్మార్వో ను కలిసిన అప్పటికీ సరైన స్పందన కరువైందని అన్నారు. ఈ నేపథ్యంలో మాకు

అప్పు ఇచ్చిన రాయపునేని సుబ్బమ్మ మా దగ్గర మేము మీ పొలాన్ని కొన్నామని చెబుతూ, గ్రామానికి చెందిన మొండెం రమణయ్య, పెంచలమ్మ, కామాక్షి, ప్రసన్న మరియు ఇనగలూరు వెంకటసుబ్బయ్య తమ పొలంలోని కోతకు వచ్చిన వరి పంటలు కోయకుండా అడ్డగించారు అని తమ ఆవేదన వ్యక్తపరిచారు. ఈ విషయమై అధికారులు స్పందించి, కలెక్టర్ ఆదేశాలు పాటించని ఎమ్మార్వో, అక్రమంగా తమ పొలంలోకి చొరబడి, పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై విచారణ జరిపించి చట్ట రీత్యా తగిన చర్యలు తీసుకోవాలని, తమ జీవనాధారం పొలాన్ని తమకు స్వాధీనం చేయాలని వేడుకున్నారు.

# నకిలీ ఈ చలాన్లా కేసులో పురోగతి

మచిలీపట్నం ఆగస్టు 26, (న్యూస్ పల్స్)కృష్ణా జిల్లా మండవల్లి సబ్ రిజిస్టార్ కార్యాలయంలో నకిలీ ఈ చలానాల కేసులో పురోగతి లభించింది. కైకలూరు పోలీస్టేషన్లో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ మాట్లాడుతూ... ప్రధాన నిందితుడైన స్టాంప్ వెండర్ రామ్ ధీరజ్ను అరెస్ట్ చేశామన్నారు. నిందితుడి వద్ద నుంచి కోటి రూపాయల నగదును స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఖజానాలో జమా చేశామని సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. నకిలీ చలానాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న బాధితులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. నిందితుల వద్ద నుంచి నూరు శాతం నగదు రికవరీకి చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ వెల్లడించారు.

# ఈ నెల 29నుంచి తెలుగు భాష వారోత్సవాలు

విశాఖపట్నంమన భాష కోసం మనం పోరాటం చేయ్యాల్సిన దుస్థితి వచ్చిందని బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. వైసీపీ టిడిపి రెండు పార్టీలు తెలుగు కు తెగులు పుట్టించారు. ఆంగ్ల మాద్యమం మీద వ్యామోహం తో రెండు పార్టీలు తెలుగు నిర్వీర్యం చేసారు. అంగన్ వాడిలో సైతం ఇంగ్లీషు పాఠాలు చేపుతున్నారు మాతృభాష కు మనుగడ లేకుండా చేసేందుకు వైసీపీ కుట్ర చేస్తుంది. మాతృభాష మీద అవగాహన లేని నాయకులు పాలకులుగా ఉండటం మన దౌర్భాగ్యం. ఈ నెల 29 నుండి సెప్టెంబర్ 4 వరకు తెలుగు భాష వారోత్సవాలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ వారోత్సవాల చేస్తున్నాము. ఈ నెల 31 న డిఎన్టి డే గా అనకాపల్లి లో నిర్వహిస్తున్నామని అన్నారు.

# చేనేత రంగానికి జీఎస్టీ దెబ్బ




కరీంనగర్, ఆగస్టు 26, (న్యూస్ పల్స్)అసలే అంతంత ఆదాయం.. రోజు రెక్కాడితేగాని డొక్కడాని పరిస్థితి.. తరతరాలుగా చేతివృత్తినే నమ్ముకుని జీవిస్తున్నప్పటికీ.. చేతినిండా పని దొరకదు. శ్రమించి చేసిన పనికి సరైన మార్కెటింగ్ సౌకర్యం కరువు. పడిన కష్టానికి గిట్టుబాట ధర లభించదు. ఈ పరిస్థితికి ఇప్పుడు కరోనా కూడా జతకలిసింది. దీంతో మూలిగే నక్కపై తాటి పండు పడిన చ ందంగా చేనేత రంగం కార్మికుల పరిస్థితి త యారైంది. ఒకే దేశం.. ఒకే పన్ను విధానంతో కేంద్ర ప్రభుత్వం వేస్తున్న పన్నులతో నేతన్న బతుకు మరింత భారతమైంది. చేనేత రంగానికి జీఎస్‌టి విధానం ఒక గుదిబండగా మారింది. దీంతో ఆ రంగాన్ని నమ్ముకునే జీవిస్తున్న అరవై వేల మంది కార్మికుల పరిస్థితి అ గమ్యగోచరంగా మారింది. ఇందులో 40వేల మంది ప్రత్యక్షంగా ఆదారపడి జీవిస్తుండగా, మరో 20వేల మందికి పరోక్షంగా ఉపాధిని పొందుతున్నారు. చేనేత రంగాన్ని కేంద్రం జిఎస్‌టి పరిధిలోకి తేవడంతో ఒక్కసారిగా పన్నుల భారం పెరిగిపోయింది. కేవలం చీరలపైనే కాకుండా చేనేత రంగానికి అనుబంధంగా ఉన్న వాటిపై కూడా జిఎస్‌టిని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం నూలుపై 5శాతం, రంగులపై 18శాతం, రసాయనాలపై 18 శాతం, తయారైన వస్త్రాలపై ఖరీదును బట్టి 5నుండి 12 శాతం జిఎస్‌టిని వసూలు చేస్తున్నారు. ఫలితంగా ఒక్కో చీరపై 40నుంచి 50 శాతం వరకు జిఎస్‌టి భారం పడుతోంది. దీనిని తట్టుకోలేక నేత కార్మికులు వృత్తికి దూరమవుతూ ఇతర వృత్తులకు మళ్లుతుతన్నారు. ఇతర ఉత్పత్తులకు ఒకే రకమైన జిఎస్‌టి అమలవుతుంటే చేనేత వస్త్రాలపై విభిన్న రకాలగా జిఎస్‌టి అమలవుతోంది. అలాగే చిలపనూలు నుంచి రంగు, రసాయనాలపై తయారైన వస్త్రాలపై కూడా జిఎస్‌టిను విధిస్తున్నారు. అంటే చేనేత మగ్గంపై తయారు చేసే వస్త్రాలపై సుమారు 40నుంచి 50 శాతం వరకు జిఎస్‌టి భారం పడుతోంది.దీని ప్రభావం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 30 శాతం మేర మగ్గాలు మూలనపడ్డాయని తెలుస్తోంది. పన్నులు లేని చిలప నూలుపై తొలిసారిగా వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 2002-03 బడ్జెట్‌లో 9.2శాతం సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ విధించింది. దీంతో అప్పట్లో రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమాలు జరిగాయి. చేనేత కేంద్రాలలో నిరాహార దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు పెద్ద ఎత్తన నిర్వహించారు. అప్పటి చేనేతల ఉద్యమ ఫలితంగా 2004లో అధికారంలోకి వచ్చిన యుపిఎ ప్రభుత్వం చిలపలనూలుపై విధించిన ఎక్సైజ్ డ్యూటీని రద్దు చేసింది. అదే సమయంలో జూట్ మిల్లులు, పవర్‌లూమ్ రంగాలకు కేంద్రం వేల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూండడంతో చేనేత రంగం తీవ్ర సంక్షోభం వైపుకు దారితీసింది. మిల్లు, పవర్‌లూమ్ రంగాలు ఉత్పత్తి చేసిన వస్త్రాలు చేనేత రంగం ఉత్పత్తి చేసిన వస్త్రాల కన్నా తక్కువ ధరలకు లభిస్తుండడంతో సామాన్య ప్రజలు మిల్లు, పవర్‌లూమ్ వస్త్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. మరమగ్గాల రంగం పోటీని తట్టుకోలేక చేనేత రంగం కుదేలవుతోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో నేపథ్యంలో మిల్లు, పవర్‌లూమ్ రంగాలు ఉత్పత్తిచేసిన వస్త్రాలు సామాన్యులకు అందుబాటు ధరలలో ఉంటే చేనేత రంగం ఉత్పత్తులు ఎగువ మధ్య ఉన్నతవర్గాలకు మాత్రమే పరిమితం అవుతున్నాయి. ఇప్పటికే పెరిగిన రసాయనాలు, నూలు ధరలతో చేనేత రంగం కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది.చేనేత రంగంలో వస్త్ర తయారీకి కూలీ కూడా గిట్టుబాటు కాక ఇతర రంగాలకు వలసలు పోతున్నారు. ఉపాధికోసం చేనేతలు ఇతర ప్రాంతాలకు వలస సపోతున్నారు. కాగా మోడీ నేతృత్వంలో కేంద్రంలో రెండవ సారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం చిలపనూలుపై మరోసారి 5శాతం జిఎస్‌టి విధించడంతో గోరుచుట్టపై రోకటిపోటులా పరిణమించింది.

# దారం గోపి కుటుంబాన్ని ఆదుకోవాలి

నందిగామ, ఆగష్టు 26 నందిగామ మార్చురీ లో విద్యార్థి దారం గోపి పార్థివదేహాన్ని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పరిశీలించారు. అయన వెంట స్థానిక తెదేపా నేతలు, మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య వున్నారు. తరువాత దేవినేని రైతుపేట పార్టీ కార్యాలయం లో మీడియాతో మాట్లాడారు.దారం గోపి అనే పిల్లవాడు అనాసాగరం హై స్కూల్ లో పదవో తరగతి చదువుతున్నాడు. ఆనాడు దేవినేని రమణ కృషి తో అనాసాగరం హై స్కూల్ 10 తరగతి వరకు అప్డేట్ చేయయించుకొని ఎంతో మంది ఉన్నత మైన స్థానాలకు వెళ్లారు. ముఖ్యమంత్రి మీరు తాడేపల్లి రాజాప్రసాదం లో ఉన్నారు. ఎక్కడ మీ విద్యాశాఖ మంత్రి కృష్ణ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు బాధ్యత లేదా జిల్లా యంత్రాంగానికి. ఒక పేద పిల్లవాడు చదువుకునే పిల్లలతో వాటర్ ట్యాంక్ లు క్లీన్ చేయిస్తారా,చెట్లు కొట్టిస్తారా, స్కూల్ ఉడిపిస్తారా. ఇదేనా మీ నాడు నేడు. '3669' కోట్లు వైసీపీ నాయకులు టెండర్లు లేకుండా పందికొక్కుల దోచుకున్నారని అన్నారు.అమ్మఒడి లో వేయి రూపాయలు కట్ చేశారు. మరుగుదొడ్లుకు ఖర్చుపెడతామన్నారు ఏమైంది ఆ వేయి కోట్లు . నాడు నేడు లో రంగు రంగులు చూపించారు కదా ఏమైంది నాడు నేడని ప్రశ్నించారు.వంద కోట్లు దాటితే ఎంక్వయిరీ అన్నారు ఏమైపోయింది మీ జ్యుడిషియల్ ఎంక్వయిరీ. మేము ఏదైనా మాట్లాడితే మేము రాజకీయం చేస్తున్నాము అంటున్నారు. 18 గంటలు అవుతుంది ఆ కుటుంబాన్ని పరామర్శించారా ఏమైపోయారు మంత్రులు. ఈ బూతులు మాట్లాడే మంత్రులు ఎవరికి సమాధానము చెబుతారు. ఇవే పనులు డబ్బులు ఉన్న పిల్లలతో చేయిస్తారా. పేద పిల్లవాడి మరణం అంటే మీకు లెక్కలేదా. స్కూల్ పనులు చేయయించి ఆ పిల్లవాడ్ని మరణం బారిన పడేసారు. ముఖ్యమంత్రి ,మంత్రి ఏమి సమాధానం చెబుతారు ఆ కుటుంబానికి ఏవిధంగా సహాయం చేస్తారు చెప్పాలి. రాష్ట్రంలో ఏ సంఘటన జరిగిన ఒక ఎస్సి పిల్లలు బలిఅవుతున్నారు. గుంటూరు ఘటన చూడండి నడి రోడ్డు మీద ఒక దళిత యువతి పై దాడి జరిగితే ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి లోకేష్ మాజీ మంత్రులు వెళ్తే వారిని అరెస్ట్ చేయయించారు. ఈ ప్రభుత్వానికి మానవత్వం లేదా మీ పెత్తం దారి విధానాలు కట్టిపెట్టండి. ఆ కుటుంబానికి న్యాయం చేయండని అన్నారు.

# వినాయకచవితి రోజు సెలవు ప్రకటించాలి

అమరావతిసెప్టెంబరు10వ తేదీన వినాయక చవితి పండుగ. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆరోజు సెలవు ప్రకటించక పోవడం పై విమర్శలు వస్తున్నాయి. ఈ అంశంపై ప్రభుత్వానికి యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ కన్వీనర్ రాంబాబు లేఖ రాసారు. ఎపి ప్రభుత్వం 10 "సెప్టెంబర్ 2021 న వినాయక చవితికి సెలవు ప్రకటించలేదు. మతాల అడ్డంకులు దాటి పౌరులందరూ ఈ ముఖ్యమైన పండుగను జరుపుకుంటారు. ఎన్ఐ చట్టం కింద కానీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సహా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ సెలవు ఇవ్వబడింది. రాష్ట్రంలో పనిచేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు ద్వారా మీకు విజ్ఞప్తి చేస్తున్నాం. నెగోషియబుల్ ఇన్స్టుమెంట్ యాక్ట్ కింద సెలవు కూడా ఉంది. అందువల్ల, వేలాది మంది బ్యాంక్ ఉద్యోగుల యొక్క మతపరమైన భావాలను గౌరవించాలి. సెప్టెంబరు 10వ తేదీన వినాయక చవితికి సెలవు ప్రకటించాలి. మా అభ్యర్థనను పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నామని అయన అన్నారు.

# శ్రీ మఠంలో సుజ్ఞానేంద్ర తీర్థుల ఆరాధన వేడుకలు

మంత్రాలయం ఆగస్టు 26, ( విభారె) శ్రీ మఠంలో సుజ్ఞానేంద్ర తీర్థుల ఆరాధన కార్యక్రమాలు పీఠాధిపతుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాలలో భాగంగా ఆరవ రోజైన గురువారం రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్ర స్వామి బంగారు బృందావన ప్రతిమను బంగారు పల్లకి లో ఉంచి శ్రీ మఠం ప్రాంగణంలో ఊరేగించారు. సుజ్ఞానేంద్ర ఆరాధనోత్సవాలలో భాగంగా స్వామి వారి చిత్రపటాన్ని రథోత్సవంపై ఉంచి మంగళ హారతులు సమర్పించి శ్రీ మఠం ప్రాంగణంలో ఊరేగించారు. మండల పరిధిలోని తుంగభద్ర( అను మంత్రాలయం) గ్రామం లో వెలసిన శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో సుజ్ఞానేంద్ర తీర్థుల ఆరాధన వేడుకలు శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్ర తీర్థల ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం

### కొనసాగుతున్న రాఘవేంద్రుల సప్త రాత్రోత్సవాలు

సుజ్ఞానేంద్ర తీర్థుల చిత్రపటాన్ని అశ్వ రథం పై ఉంచి ప్రత్యేక పూజలు చేసి మంగళ వాయిద్యాలు బాజా భజంత్రీల మధ్య పుర వీధుల్లో ఊరేగించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అంతకుముందు తుంగభద్ర గ్రామం లో శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి వివిధ రకాల అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మఠం మేనేజర్ వెంకటేష్ జ్యోషి ,ఏఏవో.మాదవి శెట్టి ,అసిస్టెంట్ మేనేజర్ ఐ.పి.నరసింహ స్వామి ద్వారపాలక అనంత స్వామి బిందు మాధవ స్వామి తుంగభద్ర మఠం మేనేజర్ నాగేష్ స్వామి పీఆర్వో .వ్యాసరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.

# యమపాశంలా మారిన రహదారులు..రోడ్లపై అప్రమత్తం కకాపోతే ప్రమాదమే..

కుక్కునూరు, ఆగస్టు 26 పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండల పరిధిలోని గోతులు పడ్డా రహదారులతో అనేక మంది వాహనదారులు మరియు ప్రయాణీకులు పలు ఇబ్బందులు పడుతున్నారు. కుక్కునూరు నుండి బూర్గంపాడు వెళ్లి రహదారి రూపుమారిపోయింది. తారు రోడ్డు ఆనవాళ్లు కోల్పోయి మట్టి మార్గాన్ని తలపిస్తోంది. ఆద్యంతం గతుకులు పడి అస్తవ్యస్తంగా తయారైంది. వర్షం పడితే గోతుల్లో నీరు చేరి ఛిద్రమవుతోంది. ప్రయాణానికి ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో వాహన చోదకులు ప్రత్యక్ష నరకం చవిచూడాల్సి వస్తోంది. రహదారిగోతులమయంగా మారటంతో ఈ రహదారి పై ప్రయాణం కొనసాగించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందని వాహనాలపై ప్రయాణించే ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కుకునూరు మండల కేంద్రం నుండి అశ్వారావుపేట వెళ్లే దారిలో పెట్రోల్ బంకు దగ్గర రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో పాటుగా, కుక్కునూరు మండల కేంద్రం నుండి బూర్గంపాడు వరకు ప్రధాన రహదారి గుంతలమయం అవడంతో మండలంలో గిరిజన గ్రామాలు కలుపుకొని వెళ్లే ఈ రహదారిపై, రేయింబవళ్లు ప్రజలు, రైతులు, వాహన చోదకులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రజలు భద్రాచలం, పాల్వంచలకు వెళ్లాలంటే ఈ రహదారే ఆధారం. కుక్కునూరు నుండి ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన వేలేరు గ్రామం వరకు ప్రజలు నిత్యం ఈ రోడ్డునే ఆయా గ్రామాల ప్రజలు ఎక్కువగా వినియోగిస్తుంటారు. రోడ్లపై గుంతలు ఏర్పడక ముందు కుక్కునూరు నుండి భద్రాచలం వెళ్ళడానికి గంటన్నర సమయం పట్టెదని రోడ్లపై గుంతలు ఏర్పడం వల్ల సుమారు రెండున్నర గంటల సమయం పడుతుందని వ్యయప్రయాసాలు తప్పడంలేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు, కార్లు, ట్రాక్టర్లు, ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తాయి. నిత్యం జామాయిల్ కర్ర అధిక లోడుతో వస్తున్న ట్రాక్టర్లు కూడా ఈ రోడ్డు మీదుగానే వెళ్తుంటాయి. ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైనా వేలేరు చెక్పోస్టుకు దగ్గర తారు రోడ్డుపై ఏర్పడిన గుంతలో జామాయిల్ కర్ర లోడ్ ట్రాక్టర్ దిగుబడి సుమారుగా 2 - 3 గంటల వరకు నడిరోడ్డుపై జామాయిల్ లోడ్ ట్రాక్టర్ గుంత నుండి బయటకు రాకపోవడంతోనే

### అధ్వానంగా కుక్కునూరు - బూర్గంపాడు మార్గం.. రూపుమారిన తారు రోడ్డు.. ఆద్యంతం గతుకులు.. అధికారులకు పట్టని వాహన చోదకులు, ప్రయాణీకుల కష్టాలు..

తారు రోడ్డుపై గుంతలు ఏర్పడి ఎంత అధ్వానంగా తయారైందనేది తెలుస్తుందని, జంగారెడ్డిగూడెం, రాజమండ్రి వెళ్లే బస్సులు,కార్లు,లారీలు, రైతులు మోటర్ సైకిళ్లు మరియు ఇతర వాహనాలపై నిత్యం ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత ప్రాధాన్యం కలిగిన ఈ రహదారి రూపుమారిపోయి అధ్వానంగా తయారైంది. ఆద్యంతం గతుకులు పడి తారురోడ్డు ఆనవాళ్లు కోల్పోయింది. ఏమాత్రం వర్షం కురిసినా గతుకుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తోంది. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, వాహన చోదకులు ప్రయాణికులు రాకపోకలకు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ఎక్కడ గొయ్యి ఉందో తెలియక వాహనాలపై ప్రయాణించే ప్రయాణీకులకు తరచూ పెను ప్రమాదాలు సంబవించే పరిస్థితులను ఎదుర్కొంటున్నామని, దీనికి తోడూ గుంతలు పడిన రోడ్లపై వాహనాలు తిరగడం వల్ల వాహనదారుడి జేబుకు చిల్లు పడుతుందని,గుంతలు పడిన రోడ్లమీద వాహనాలపై ప్రయాణిస్తే వాహనాలు గుళ్ళ అయి మెకానిక్ల జేబులను కాసులతో నింపుతున్నాయని, కురుస్తున్న వర్షాలకు రోడ్ల పై ఉన్న గుంతలలోకి నీరు చేరడంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపైన గుంతలలోకి నీరు చేరడంతో రోజు నానా అవస్థలు పడుతూ బిక్కూ-బిక్కూ మంటూ ప్రయాణిస్తూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రాత్రుళ్లు బైకులపై ప్రయాణించేటప్పుడు గోతుల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నయని, ఇవి రహదారుల్లా లేవని గుంతలు పడి రోడ్లు యమపాశంలా ఉన్నాయని, రాత్రి సమయాల్లో ఈ మార్గంలో ప్రయాణించక పోవడమే ఉత్తమమని వాహన చోదకులు, ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రహదారికి తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని వారు వేడుకుంటున్నారు.

# ఈ మూడు అలవాట్లు మీ తల్లిని ఆరోగ్యంగా మరియు సంతోషంగా ఉండేలా చేయగలవు



హైదరాబాద్, ): దేవుడు ప్రతిచోటా ఉండలేక అమ్మని స ృష్టించాడు అంటారు. నిజమే, ప్రేమకి స్వచ్ఛమైన రూపంలా ప్రతిబింబిస్తుంది అమ్మ. తల్లి విలువ తెలిసిన ప్రతిఒక్కరికీ తల్లిప్రేమ విలువ తెలుస్తుంది. తల్లి అంటేనే ఒక అద్భుతం, కుటుంబానికి వెన్నెముకలా ఉంటూ, అందరి సంరక్షణకు బాధ్యత వహించే నిస్వార్ధ జీవి అమ్మ.ఈ ప్రపంచమంతా మనల్ని విడిచినా, మన చేయి వదలకుండా మనకు మద్దతునిచ్చే ఒకే ఒక వ్యక్తి అమ్మ. ఆమె ఉదారత, సంరక్షణ, ఆప్యాయత, క్షమాగుణం ఏ ఇతర వ్యక్తితోనూ సరితూగదు. ఒక తల్లి ప్రేమను నిర్వచించడం ఎంతటి వారికైనా ఒక సవాలుగానే ఉంటుంది. ప్రతి ఒక్కరి వ్యక్తిగత అవసరాలను నిరంతరం గమనిస్తూ, తనవారికోసం, ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడే అమ్మ అనిర్వచనీయం. అటువంటి అమ్మను జీవితాంతం సంతోషంగా చూసుకోవలసిన బాధ్యత మనమీద ఉంటుంది. అవునా? కొన్నిరోజుల క్రితం, ప్రపంచ తల్లుల దినోత్సవం నాడు మంచిమంచి కాప్షన్లతో కూడిన చిత్రాలు, కొటేషన్లు, శీర్షికలను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తూ, వారివారి తల్లుల మీద ఉన్న ప్రేమను ప్రపంచంతో పంచుకోవడం అందరమూ చూశాము. కానీ మిగిలిన సంవత్సరమంతా అదే ప్రేమను కొనసాగిస్తున్నారా? లేదా కేవలం సోషల్ మీడియాలో లైకులు, షేర్ల కోసమే అన్నట్లు పోస్ట్స్ చేశారా? ఇక్కడ ఎవరినీ కించపరచడం లేదు. తల్లులను గుండెలలో పెట్టుకుని చూసే పిల్లలు ఉన్నట్లే, వారిని నిరంతరం తమచేష్టలతో భాదపెట్టే వారు కూడా ఈ ప్రపంచంలో సర్వసాధారణం. మారుతూ ఉన్న టెక్ ప్రపంచం కారణంగా పక్కన చేరి, బాగోగులు అడగాల్సిన వారు ఎప్పుడో కానీ, మెసేజ్ లేదా కాల్స్ ద్వారా చుట్టపు చూపుగా పలకరిస్తూ సంబంధాల ఉనికినే ప్రశ్నార్ధకం చేస్తున్నారు అన్నది వాస్తవం. ఆమెకు ఖరీదైన బహుమతులను ఇవ్వడానికి బదులుగా, ఇక్కడ చెప్పబడిన మూడు అలవాట్లను పాటిస్తున్నారేమో గమనిస్తూ ఉండండి. ఈ మూడు అలవాట్లు, ఆమెను సంతోషంగా, ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేస్తాయి. 1. పోషకాహారాన్ని తీసుకోవడం:తల్లి, వారి పిల్లలు తినగా మిగిలిపోయిన ఆహారాన్ని తినే అలవాటును కలిగి ఉంటుంది. దీనికి కారణం, ఆమె ఆహారాన్ని వ ృధాచేయటానికి ఇష్టపడకపోవడమే. మరియు కష్టపడి సంపాదించినది అన్న భావన. ఇలా పిల్లలు తినగా మిగిలిన బర్గర్/పాన్కేక్ వంటి ఆహారాలను తరచుగా తీసుకోవడం కారణంగా, శరీరంలో అదనపు కేలరీలు పేరుకొనిపోయే ప్రమాదం ఉంది. క్రమంగా ఇది ఊబకాయానికి దారితీయవచ్చు.మీ పిల్లలు తినే తీరు, పరిమాణం వయసు ద ృష్ట్యా మారుతుందని గ్రహించడం అత్యవసరం. పసిపిల్లలకు కొంత సమయం విరామం ఇచ్చిన తర్వాత భోజనం అవసరం ఉండవచ్చు, కానీ పెద్దలలో, జీర్ణవ్యవస్థ భిన్నంగా ఉన్న కారణాన, ప్రతి రెండు-మూడు గంటలకు ఒకసారి ఆహారాన్ని తీసుకోవలసిన అవసరం ఉండదు. కావున తీసుకునే ఆహారం మీద శ్రద్ధ ఉంచడం అవసరం.అంతేకాక, అధిక పనిఒత్తిడి కారణంగా మహిళల్లో అనేకమంది తరచుగా ఆహారాన్ని మరచిపోవడం, లేదా స్కిప్ చేయడం చేస్తుంటారు. సంవత్సరాలుగా, ఈ నిర్లక్ష్యం కొనసాగడం మూలంగా శరీరంలో అత్యంత ముఖ్యమైన పోషకలోపాలకు దారితీస్తుంది. శరీరం ఆరోగ్యకరమైన జీవక్రియలను కలిగి ఉండాలంటే, మన శరీరంలో తగినంత ప్రోటీన్ ఉండటం అవసరం. కావున, మహిళలు వర్కింగ్ ఉమెన్ అయినా, గ ృహిణిగా ఉన్నా, బ్రొకోలీ, బాదం, గుడ్లు, కాటేజ్ చీజ్, చికెన్ బ్రెస్ట్, లీన్ బీఫ్, చేపలు, క్వినోయా మరియు వోట్మీల్ వంటి ప్రోటీన్ ఆధారిత ఆహారాలను తరచుగా తీసుకునేలా జాగ్రత్త వహించాలి. 2. వ్యాయామం తప్పనిసరి:మన తల్లుల దైనందిక జీవనచర్యలలో బిజీషెడ్యూల్ నిమిత్తం, వ్యాయామానికి సమయం కేటాయించలేని స్థితిలో ఉంటూ ఉంటారు. కానీ ఒక ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలంటే, జీవనశైలికి సరిపోయేలా, మరియు శరీరం క్రియాశీలకంగా ఉండేందుకు వ్యాయామం తప్పనిసరిగా ఉంటుంది. వ్యాయామశాలకు వెళ్ళే సమయం లేనిపక్షంలో, ఇంటిలోనే కాస్త సమయం కేటాయించి కొన్ని వ్యాయామ పద్ధతులను అనుసరించడం మేలు. అంతేకాకుండా, జాగింగ్, నడక, ఏరోబిక్స్, యోగా వంటివి కూడా అనుసరించవచ్చు. క్రమంగా అదనపు కేలరీలు కరిగి, శరీరం చురుకుగా ఉండేలా సహకరిస్తుంది.

## పుజారాకు టెక్నిక్‌తో పాటు మైండ్ పోయింది: వాన్

లీడ్స్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో టీమిండియా స్పెషలిస్ట్ చతేశ్వర్ పుజారా ఘోర వైఫల్యం కొనసాగుతూనే ఉంది. లీడ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పుజారా తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క పరుగు మాత్రమే చేసి అవుటయ్యాడు. అండర్సన్ బౌలింగ్‌లో బట్లర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ మాజీ ఆటగాడు మైకెల్ వాన్ పుజారాపై ఆసక్తికరవ్యాఖ్యలు చేశాడు. " పుజారా తన ఆటతీరును పూర్తిగా మరిచిపోయాడు. సముద్రంలో మునిగిన నావలా అన్న చందంగా పుజారా పరిస్థితి తయారైంది. అతనికి మైండ్ పోవడంతో పాటు తన మార్క్ టెక్నిక్ షాట్లను మరిచిపోయాడు. ఆటలో స్కోరు నమోదు చేయడం కంటే మ్యాచ్‌లో నిలవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాడు. ఆ ఒత్తిడిలో కూరుకుపోయి అతను తేలిగ్గా వికెట్ ఇచ్చేస్తున్నాడు." అంటూ కామెంట్స్ చేశాడు. 2020 నుంచి చూసుకుంటే టెస్టుల్లో పుజారా సగటు 25కు తక్కువగా ఉండడం గమనార్హం. ఇక 11 ఇన్నింగ్స్‌ల నుంచి పుజారా అర్ధసెంచరీ నమోదు చేయలేకపోయాడు.

# రాంగ్ ట్రాక్ లో వెళ్లానని ఒప్పేసుకున్న హీరో



తప్పులు చేయటం అందరూ చేస్తారు. దీనికి ఎవరూ మినహాయింపు కాదు.కానీ.. చేసిన తప్పును అందరి ముందు ఒప్పుకునే గట్స్ చాలా తక్కువ ఉంటాయి. అందులోని సినిమా ఇండస్ట్రీలో పేరున్న కుటుంబం నుంచి వచ్చి.. సక్సెస్ అంతగా లేని ఒక హీరో.. తన తప్పుల్ని ఒప్పుకోవటం.. అది కూడా అందరి ముందు అంటే అందుకు చాలానే గుండె ధైర్యం కావాలి. తాజాగా చెప్పిన మాటలతో తనకు ధైర్యం విషయంలో మాత్రం టన్నుల కొద్దీ ఉందన్న మాటను చెప్పకనే చెప్పేశారని చెప్పాలి.టాలీవుడ్ లో ఉన్న హీరోల్లో సుశాంత్ కాస్త భిన్నమని చెప్పాలి. ఆయన తీరు మిగిలిన వారి మాదిరి ఉండదు. అతను చేసిన సినిమాల్లో పెద్దగా ఆడింది లేదు. అలా అని తీసిపారేయటానికి లేదు. సినిమాల ఎంపికలో అతగాడి తప్పులు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంటాయి. ఆ మధ్యన చేసిన చిలాసౌ.. ఆ తర్వాత చేసిన అల వైకుంఠపురములో.. సినిమాలు కాస్త భిన్నమనిచెప్పాలి.తాజాగా అతగాడు హీరోగా ఇచట వాహనములు నిలుపురాదన్న టైటిల్ తో ఒక సినిమా ఈ వారం విడుదల కానుంది. ఈ సినిమా మీద ఆసక్తి వ్యక్తమవుతోంది. డిఫరెంట్ కథతో ముందుకు వస్తున్నట్లు చెబుతున్న ఈ మూవీ సుశాంత్ ను ఎక్కడికి తీసుకెళుతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాకు సంబంధించిన ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వేళ.. అందులో సుశాంత్ మాట్లాడి అందరి మనసుల్నిదోచేశారు.ఎందుకంటే.. తాను చేసిన తప్పుల్ని ఓపెన్ గా ఒప్పేసుకున్నాడు. దర్శకులు త్రివిక్రమ్ చెప్పినప్పుడు కెరీర్ స్టార్టింగ్ లో కష్టపడాలని తెలుసు కానీ క్లారిటీ లేదన్నారు. ఏ డైరెక్షన్ లో ముందుకు వెళ్లాలో మొదట్లో అర్థం కాలేదని.. రాంగ్ ఇన్ ఫ్లుయెన్స్ లో పడి పోయినట్లు చెప్పారు. ఇది తన తప్పేనని ఒప్పేసుకున్నారు. ఇంతలా ఒప్పేసుకోవటం అందరికి సాధ్యం కాకపోవచ్చు. ఈ విషయంలో మిగిలిన వారికి తాను భిన్నమన్న విషయాన్ని సుశాంత్ చేతల్లో చేసి చూపించారని చెప్పాలి. మరి.. అతగాడి కొత్త సినిమాకు ఆల్ ద బెస్టు చెప్పేద్దామా?

# ప్రపంచంలో మరెవరూ చేయలేని సాహసం తెలుగు ప్రజలు చేస్తున్నారట

మాటలతో మేజిక్ చేయటం తెలిసిందే. అయితే.. ఎక్కడా పట్టు తప్పకుండా.. పక్కదారికి పోకుండా మాటలతో మంత్రించినట్లుగా సీట్లకు అతుక్కుపోయేలా.. చూసిన సినిమాను మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా తీయటంలో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ టాలెంటే వేరని చెప్పాలి. చాలామంది దర్శకులకు భిన్నంగా తన సినిమాల్లో మహిళల పాత్రల్ని తీర్చి దిద్దే తీరు వేరుగా ఉంటుందన్న విషయం తెలిసిందే. చిన్నగా చెప్పే మాటలతో అంతులేని లోతు ఉండేలా ఆయన మాటలు ఉంటాయి.ందుకే.. ఆయన మైకు పట్టుకున్న ప్రతిసారి తెలుగు ప్రేక్షకుడు చాలా జాగ్రత్తగా ఆయన మాటల్ని వింటుంటారు. తాజాగా



ఆయన 'ఇచట వాహనములు నిలుపరాదు' సినిమాకు సంబంధించిన కార్యక్రమానికి హాజరయ్యారు. సుశాంత్ హీరోగా నటించిన ఈ సినిమా మీద అంచనాలు బాగున్నాయి. భిన్నమైన కాన్సెప్టుతో సినిమాను తీశారన్న మాట వినిపిస్తోంది.ఇదిలా ఉంటే.. తాజాగా తెలుగు ప్రేక్షకులు.. వారి సాహసం గురించి త్రివిక్రమ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.తనకు తెలిసి ప్రపంచం మొత్తంలో థియేటర్స్ కు వచ్చేందుకు సాహసిస్తున్న జాతి.. తెలుగుజాతి మాత్రమేనని చెప్పారు. నిజమే.. తెలుగువారి జీవితాల్లో సినిమా ఒక భాగం. తొక్కలో కరోనా అయితే అయి ఉండొచ్చు. కానీ.. వెండి తెర మీద వెలిగిపోయే బొమ్మల్ని చూస్తే.. ఆనందపడే తెలుగు ప్రేక్షకుడికి సినిమా తమ జీవితాల్లో ఎంత ముఖ్యమన్న విషయాన్ని చెప్పకనే చెప్పేస్తున్నారు. అయితే.. త్రివిక్రమ్ చెప్పిన మాటకు మరో మాటను జత చేయాల్సిన అవసరం ఉంది.సెకండ్ వేవ్ తర్వాత థియేటర్లు ఓపెన్ చేసుకోమన్నా చేసుకోకుండా ఉండటం ఒక ఎత్తు అయితే.. కాస్త గ్యాప్ తో థియేటర్లు ఓపెన్ చేసినా.. ఒక మోస్తరు సినిమాలే తప్పించి పేరున్న నటీనటుల సినిమాలు కానీ.. అగ్ర దర్శకుల మూవీలు కానీ విడుదల కాని పరిస్థితి. ఇదంతా చూసినప్పుడు త్రివిక్రమ్ చెప్పినట్లుగా ప్రపంచంలో మరే జాతి చేయని సాహసం తెలుగు జాతి చేస్తుంది కానీ.. తెలుగు సినిమాలు తీసే నిర్మాతలు మాత్రం చేయటం లేదని చెప్పక తప్పదు.

# హీరోయిన్ల మెడకు ఉచ్చు బిగించిన తలవెంట్రుకలు..!

బాలీవుడ్ - శాండిల్ వుడ్ డ్రగ్ రాకెట్ కేసు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తీగలాగితే డొంకంతా కదిలినట్లు ఈ కేసులో ఎంతోమంది సెలబ్రిటీలు సినీ నటీనటులు బయటకు వచ్చారు. గతేడాది లాక్ డౌన్ లో బెంగళూరులో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ వ్యవహారం.. బెంగళూరు సెంట్రల్ క్రైమ్ బ్రాంచీ పోలీసుల మెరుపు దాడులు - దర్యాప్తుతో కన్నడ చిత్ర సీమకు చుట్టుకుంది. అనేకమంది ప్రముఖులు నిషేధిత డ్రగ్ వాడుతున్నారని పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో హీరోయిన్లు సంజన గల్రానీ - రాగిణీ ద్వివేది పేర్లు తెర పైకి వచ్చాయి.సంజన - రాగిణీ లకు డ్రగ్ ప్లెడర్లతో సంబంధాలు ఉన్నాయని.. తరచూ డ్రగ్ మాదకద్రవ్యాల వినియోగం - సరఫరా ఆరోపణలతో సీసీబీ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. సెప్టెంబర్ 7న రాగిణి ద్వివేదిని.. సెప్టెంబర్ 9న సంజనను అరెస్ట్ చేశారు. వీరితో పాటుగా వీరేన్ ఖాన్నా - కర్ణాటక మాజీ మంత్రి జీవరాజ్ ఆల్వా కుమారుడు ఆదిత్య ఆల్వా.. ఇంకా 20 మందికిపైగా సెలబ్రిటీలను ఈ కేసులో అరెస్ట్ చేశారు. బెంగుళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైల్లో రిమాండ్ లో ఉన్న ఇద్దరు హీరోయిన్ లకు.. బెయిల్ లభించడంతో బయటకు వచ్చారు.అయితే డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయిన సంజన - రాగిణీ ల తలవెంట్రులను సేకరించిన బెంగుళూరు పోలీసులు.. గతేడాది అక్టోబర్ లో హైదరాబాద్ లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీకి (సీఎఫ్ఎస్ఎల్) పంపిన సంగతి తెలిసిందే. తాజాగా అఈూఒ రిపోర్ట్ విడుదల అయింది. ఇందులో సంజన గల్రానీ - రాగిణి ద్వివేది డ్రగ్స్ వినియోగించారనే విషయం సేవించినట్లు నివేదికలు స్పష్టం చేశాయి. దీనిపై అధికారులు స్పందిస్తూ.. వారి నుంచి మూత్ర రక్త పరీక్షలనే కాకుండా డ్రగ్స్ వినియోగ నిర్ధారణ పరీక్షల కోసం వెంట్రుకల శాంపిల్స్ కూడా తీసుకున్నామని.. 2020 అక్టోబర్ లో హైదరాబాద్ లోని ఫోరెన్సిక్



సైన్స్ లాబోరేటరికీ పంపించామని తెలిపారు.డ్రగ్స్ కేసును తల వెంట్రుకల ద్వారా దర్యాప్తు చేయడం ఇదే తొలిసారి అని.. ఒకసారి డ్రగ్స్ తీసుకొంటే ఏడాది పాటు వెంట్రుకల్లో వాటి కణాలు నిక్షిప్తమై ఉంటాయని అధికారులు పేర్కొన్నట్లు కన్నడ మీడియా తెలిపింది. ఇక మాధకద్రవ్యాల కేసు దర్యాప్తు పట్ల బెంగళూరు పోలీస్ కమిషనర్ కమల్ పంత్ సంతృప్తిని వ్యక్తం చేశారు. గత సెప్టెంబర్ లో పలువురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని.. కోర్టులో ఛార్జిషీట్ కూడా దాఖలు చేశాంమని.. బెంగళూరు పోలీసులు డ్రగ్స్ కేసును నిజాయితీగా వేగంగా దర్యాప్తును పూర్తి చేయడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.

# 'అఖండ' అలాంటి అవకాశాన్ని వదులుకోదు కదా..?

నటసింహం నందమూరి బాలకృష్ణ - దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతోన్న యాక్షన్ ఎంటర్టైనర్ "అఖండ". రెండు పాటలు మినహా ఈ సినిమా షూటింగ్ మొత్తం పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో దసరా కానుకగా విడుదల అవుతుందని వార్తలు వస్తున్నాయి. దర్శకధీరుడు రాజమౌళి రూపొందిస్తున్న 'ఆర్ ఆర్ ఆర్' చిత్రాన్ని అక్టోబర్ 13న రిలీజ్ చేసే అవకాశాలు లేకపోవడంతో.. ఇప్పుడు పండుగ సీజన్ ను క్యాష్ చేసుకోవడానికి 'అఖండ' మేకర్స్ ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది.అన్నీ అనుకున్నట్లు జరిగితే 'అఖండ' చిత్రాన్ని అక్టోబర్ 8న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉందని టాక్ వచ్చింది. అయితే ఇప్పుడు లేటెస్టుగా దసరా సమయానికి బాలయ్య సినిమా కంప్లీట్ అవుతుందో లేదో అని సందేహాలు వ్యక్తం అవుతున్నాయని తెలుస్తోంది. 'అఖండ' సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఎక్కువ టైమ్ కేటాయించాల్సి ఉందట. భారీ ఎఈచీ వర్క్స్ చేయాల్సి ఉండగా.. అక్టోబర్ ఫస్ట్ వీక్ నాటికి ఈ సినిమా రెడీ కాకపోవచ్చనే రూమర్ ఒకటి ఫిలిం సర్కిల్స్ లో వినిపిస్తోంది.'అఖండ' సినిమా పనులు సెప్టెంబర్ నాటికి పూర్తయితే కచ్చితంగా దసరా స్పెషల్ గా విడుదల అవుతుందని చెప్పవచ్చు. ఒకవేళ అప్పటికి పూర్తి కాకపోతే మాత్రం బాలకృష్ణ - బోయపాటి ఒక సువర్ణావకాశాన్ని కోల్పోయినట్లే. ఎందుకంటే ప్రస్తుతానికి ఫెస్టివల్ సీజన్ లో పాన్ ఇండియా చిత్రాలు ఇతర పెద్ద సినిమాలేవీ వచ్చే సూచనలు కనిపించడం లేదు. 'కొండ పొలం' 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' వంటి సినిమాలు మాత్రమే పండుగను టార్గెట్ చేస్తున్నారు.క్రిష్ జాగర్లమూడి - వైష్ణవ్ తేజ్ ల కాంబోలో రూపొందిన 'కొండ పొలం' చిత్రాన్ని అక్టోబర్ 8న విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఇక అఖిల్ అక్కినేని - బొమ్మరిల్లు భాస్కర్ కలయికలో వస్తున్న 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్' ని అదే టైం లో రిలీజ్ చేయాలని గీతా ఆర్ట్స్ ప్రొడ్యూసర్స్ ప్లాన్ చేస్తున్నారని టాక్. బాలకృష్ణ చిత్రానికి ఇవన్నీ పెద్ద పోటీ కాకపోవచ్చు. అందుకే దసరా సీజన్ 'అఖండ' కు చాలా అనువైనదని చెప్పవచ్చు.ఒకవేళా 'అఖండ' చిత్రాన్ని అక్టోబర్ లో రిలీజ్ చేయలేకపోతే మాత్రం డిసెంబర్ లో కొత్త తేదీ కోసం వెతుక్కోవాల్సి ఉంటుంది. సంక్రాంతి సీజన్ ను ఆల్రెడీ నాలుగు పెద్ద సినిమాలు బ్లాక్ చేసుకున్నాయి. క్రిస్మస్ సీజన్ కోసం 'పుష్ప' 'ఏజెంట్' వంటి సినిమాలు కర్చీఫ్స్ వేసాయి. అందుకే బాలయ్యకు దసరా బెస్ట్ సీజన్ అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190